## నీట్ - పీజీకి పకడ్బందీ ఏర్పాట్లు




# బలగం TV

BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం, 30 ఆగస్టు-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8


## నేపాల్‌లో కొట్టుకొచ్చిన బ్యాంకు లాకర్..



# సురేఖ ఇంటికే!.. 3 తర్వాత మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ..

- 3న అధిష్ఠానంతో సీఎం, డిప్యూటీ, పీసీసీ చీఫ్ భేటీ
- మంత్రివర్గం, పార్టీ వ్యవహారాలపైనా చర్చించే చాన్స్
- 1న విదేశీ పర్యటన నుంచి రానున్న కేసీ వేణుగోపాల్
- కష్టపడి అధికారంలోకి తెచ్చి.. పదవులిచ్చి గౌరవిస్తే
- ఇంట్లో ఉన్న పిల్లలతో ఇష్టం వచ్చినట్లు తిట్టిస్తారా?
- సన్నిహితుల వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవేదన!



వివరాలు 2లో..

# గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ విఫలం

- నందగోకుల్-చల్మెడ రోడ్డు నిర్మించాలి: పద్మాదేవేందర్‌రెడ్డి
- నందగోకుల్ నుంచి పాదయాత్ర
- పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ శేరి, మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల



వివరాలు 2లో..

# పిచ్చోడి చేతిలో రాయిలా రేవంత్ పాలన



- పేదలను మానసిక క్షోభకు గురిచేస్తున్నారని ఆగ్రహం
- 22ఏ బాధితులకు భరోసా కల్పించిన బీఆర్ఎస్
- కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం.. వంటావార్పు చేస్తాం

హైదరాబాద్, ఆగస్టు 29 : రాష్ట్రముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలన పిచ్చోడి చేతిలో రాయిలాగా తయారైందని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. 1980లో లే అవుట్ చేసి 46 ఏళ్లుగా నివసిస్తుంటే ఇప్పుడు వాటిని నిషేధిత జాబితాలో పెట్టి పిల్లల పెళ్లిళ్లు, చదువులకు ఆటంకం కలిగిస్తున్నారని, బ్యాంక్‌లోన్‌లు రాకుండా చేస్తున్నారని మండిపడ్డారు. పైసా పైసా కూడబెట్టుకుని ఇల్లు కట్టుకుంటే రాత్రికి రాత్రి నిషేధిత జాబితాలో పెట్టి మానసిక క్షోభకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హుడా పర్మిషన్లు, మున్సిపల్ పర్మిషన్లు, కరెంటు, నల్లా కనెక్షన్లు ఇచ్చి ప్రాపర్టీ టాక్స్‌లు వసూలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు మీ ఆస్తులు 22ఏలో ఉన్నాయని ఇళ్లను కూల్చడం దుర్మార్గమన్నారు. పటాన్‌చెరు పరిధిలోని ఓ ఎమ్మార్వో ఏకంగా 2 కోట్లు లంచం అడిగాడని, హైకోర్టు అక్షింతలు వేసినా పట్టించుకోకుండా ఇల్లు కూలగొట్టి తనను రోడ్డున పడేశారని ఓ బాధితుడు కన్నీరు మున్నీరుగా చెబుతుంటే రేవంత్ రెడ్డికి చీమ కుట్టినట్లు కూడా లేదా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. గుమ్మడిదలలో 12,430 ఎకరాలు, అమీన్‌పూర్‌లో 3,266 ఎకరాలు, రామచంద్రాపురంలో 8,360 ఎకరాలు, పటాన్‌చెరులో 12,593 ఎకరాలు, జిన్నారంలో 13,916 మిగతా 3లో..

## ముందుగా కమిటీకి ఎథిక్స్ ఉండాలి!..



- కౌశిక్‌రెడ్డిపై ఏకపక్షంగా వ్యవహరించొద్దు
- కాంగ్రెస్ ఎమ్మెల్యేల అభిప్రాయాలను 'మూడ్ ఆఫ్ ద హౌస్'గా ఎలా పరిగణిస్తారు?
- సభలో అనుచితంగా మాట్లాడిన సీఎం రేవంత్, సామేలు, దానం సహా అందరినీ కమిటీ పిలువాలి
- కౌశిక్‌రెడ్డికి జవాబు చెప్పుకొనే అవకాశం ఇవ్వాలి
- మీడియాతో ఎథిక్స్ కమిటీ సభ్యుడు ప్రశాంత్‌రెడ్డి

మిగతా 3లో..

# 420 మోసాలపై.. బీఆర్ఎస్ పోరుబాట

- వెయ్యి రోజులవుతున్నా హామీల ఎగవేతపై నిలదీసేందుకు సన్నద్ధం
- సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు రాష్ట్రవ్యాప్తంగా పలు కార్యక్రమాలు
- నాలుగు రోజుల ముందు నుంచే శ్రేణులతో సన్నాహక సమావేశాలు
- కాంగ్రెస్ విఫల పాలనపై ప్రజలకు వివరించాలని బీఆర్ఎస్ నేతల దిశానిర్దేశం
- వెయ్యి రోజులవుతున్నా చేయకపోవడంపై నిలదీసేందుకు బీఆర్ఎస్ సన్నద్ధం



హైదరాబాద్, ఆగస్టు 29: అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఇచ్చిన హామీలను అమలుచేస్తామని చెప్పి వెయ్యి రోజులవుతున్నా హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ కార్యానిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వినూత్న నిరసనలకు పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 2 నుంచి 8 వరకు వారం రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టే కార్యక్రమాల కోసం శనివారం పలు నియోజకవర్గాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ.. 420 హామీలు, 13 డిక్లరేషన్లు, 6 గ్యారెంటీలను 100 రోజుల్లో నెరవేరుస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, అన్ని వర్గాలను నట్టేట ముంచిందని మండిపడ్డారు. ప్రతి ఇంటికీ బాకీ కార్డుల పంపిణీ, నియోజకవర్గాల్లో ధర్నాలు, రైతు సదస్సులు, విద్యార్థుల ర్యాలీలతో కాంగ్రెస్ మోసాన్ని ఎండగట్టేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.పలు నియోజకవర్గాల్లో శనివారం నిర్వహించిన సన్నాహక సమావేశాల్లో పార్టీ నేతలు హాజరై శ్రేణులతో మాట్లాడారు. జనగామ జిల్లాలోని పలు మండలాల్లో నిర్వహించిన సమావేశాల్లో మాజీ ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. 420 హామీలు, 13 డిక్లరేషన్లు, ఆరు గ్యారెంటీలను 100 రోజుల్లోనే నెరవేరుస్తామని చెప్పి ఏ ఒక్కటీ నెరవేర్చలేదని మండిపడ్డారు. బీఆర్ఎస్ శ్రేణులంతా ఏకతాటిపైకి వచ్చి కాంగ్రెస్ మిగతా 3లో..

# ఎల్‌నినోతో కాదు..ముమ్మాటికీ కాంగ్రెస్ సృష్టించిన కరువే

### మాజీ మంత్రి జగదీష్ రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 29: రాష్ట్రంలో రాక్షసపాలన కొనసాగుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి ఆరోపించారు. కాలమో, ఎల్‌నినో తో వచ్చిన కరువు కాదు.. ముమ్మాటికీ కాంగ్రెస్ సృష్టించిన కరువే నని ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించ నున్న నిరసన కార్యక్రమాలపై సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ నియోజకవర్గ ముఖ్య నేతలతో ఆయన సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రైతాంగ సమస్యలపై ప్రభుత్వానికి దున్నపోతుపై వాన పడ్డట్టుందని ఆరోపించారు. పాము తన పిల్లలను తానే చంపుకున్నట్లు.. కాంగ్రెస్ తెలంగాణ రైతాంగాన్ని చంపుతుందని విమర్శించారు.కృష్ణా, గోదావరి నీళ్లు ఎట్లా పోతున్నాయో కేటీఆర్, తాము కళ్లకు కట్టినట్లు చూపించినం. సుందిళ్ల, అన్నారం బ్యారేజులు మిగతా 3లో..

# జీవో 97ను రద్దు చేయాలి



### ఎమ్మెల్యే కడియం శ్రీహరి

హైదరాబాద్, ఆగస్టు 29 : జీవో 97 రద్దు చేయాలని ఫిరాయింపు ఎమ్మెల్యే కడియం శ్రీహరి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కడియం శ్రీహరి మాట్లాడుతూ.. మాజీ విద్యాశాఖ మంత్రిగా జీవో 97ను రద్దు చేయాలి. పాలిటెక్నిక్ ఎడ్యుకేషన్‌ను ఇంజినీరింగ్ ఎడ్యుకేషన్‌తో కలిపే ఉంచాలని డిమాండ్ చేస్తున్నానన్నారు. పాలిటెక్నిక్ ఎడ్యుకేషన్‌ను లేబర్ అండ్ ఎంప్లాయిమెంట్ కిందకు తీసుకురావొద్దు.. తద్వారా మిగతా 3లో..

## సమరభేరికి బీఆర్ఎస్ సన్నద్ధం



- కాంగ్రెస్ వెయ్యి రోజుల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యాచరణ
- ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు నేతృత్వంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సమావేశం

వివరాలు 2లో..

## సాగు, తాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వ నిర్లక్ష్యం



- యాదాద్రికి గోదావరి జలాల వాటా కేటాయించాలి
- పెండింగ్‌లో ఉన్న నీటి ప్రాజెక్టుల పూర్తికి నిధులివ్వాలి
- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో భువనగిరిలో పాదయాత్ర ప్రారంభం
- జిల్లా కార్యదర్శి జహంగీర్ నేతృత్వంలో కదిలిన కామ్రేడ్స్
- 31న హైదరాబాద్‌లో మహాధర్నా..
- సమస్యలు పరిష్కరించకుంటే పెద్దఎత్తున ప్రజా ఉద్యమం :
- సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఎస్. వీరయ్య

మిగతా 4లో..

# రేవంత్ రెడ్డి మాటల్ని సీరియస్‌గా తీసుకోవద్దు..

### సురేఖ పదవికి ఢోకా లేదు..!



హైదరాబాద్, ఆగస్టు 29: కాంగ్రెస్‌లో వర్గపోరు, వచ్చే ఎన్నికల్లో పోటీపై చెలరేగుతున్న వివాదాలపై పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పందించారు. ఇటీవల హాట్ టాపిక్‌గా మారిన పరకాల అసెంబ్లీ టికెట్‌పై మాట్లాడిన ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటల్ని సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. రేవంత్ చెప్పినంత మాత్రాన సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డికి మళ్లీ టికెట్ ఇవ్వరు కదా అని మహేశ్ కుమార్ పేర్కొన్నారు.పరకాల టికెట్‌పై సీఎం రేవంత్ రెడ్డి మాటే ఫైనల్ కాదని, అధిష్టానం నిర్ణయిస్తుందని చెప్పిన పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మంత్రి కొండా సురేఖ పదవిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆమె పదవి సేఫ్ అని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ మంత్రివర్గంలో బీసీలకు సరైన వాటా దక్కలేదని పేర్కొన్న ఆయన.. ఈ విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లానని వెల్లడించారు. 'తెలంగాణలో మంత్రి పదవుల కేటాయింపులో బీసీలకు తగిన న్యాయం జరగలేదని రాహుల్ గాంధీకి చెప్పాను. అలాంటప్పుడు సురేఖను మంత్రి పదవి నుంచి ఎందుకు తొలగిస్తాం?' అని మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. అంతేకాదు తాము ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు వంద శాతం మిగతా 3లో..

# గోల్ఫ్ టూరిజం హబ్‌గా తెలంగాణ

- జవహర్‌నగర్‌లో 130 ఎకరాల్లో గోల్ఫ్ కోర్సు
- సోమశిలలో మరో ప్రపంచస్థాయి కేంద్రం
- పీపీపీ విధానంలో అభివృద్ధి
- పర్యాటకం, క్రీడల ప్రచారానికి కపిల్ సేవల వినియోగం :
- మంత్రి జూపల్లి కృష్ణారావు



హైదరాబాద్, ఆగస్టు 29: తెలంగాణను ప్రపంచస్థాయి గోల్ఫ్ టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతున్నదని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఇందులో భాగంగా శామీర్‌పేట సమీపంలోని జవహర్‌నగర్‌లో 130 ఎకరాల్లో గోల్ఫ్ కోర్సు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా గోల్ఫ్ క్రీడాకారులను ఆకర్షించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో మౌలిక వసతులు అభివృద్ధి చేస్తామన్నారు. కృష్ణానది తీరంలో, నల్లమల అడవులు, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పర్యాటక క్లస్టర్ సోమశిలలో మరో ప్రపంచస్థాయి గోల్ఫ్ కోర్సు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. సోమశిలను ప్రత్యేక గోల్ఫ్ టూరిజం గమ్యస్థానంగా అభివృద్ధి చేయడంతో తెలంగాణను గోల్ఫ్ టూరిజం హబ్‌గా మరింత బలోపేతం చేయవచ్చన్నారు. గోల్ఫ్ టూరిజం మౌలిక వసతుల అభివృద్ధిలో పబ్లిక్-ప్రైవేట్ మిగతా 3లో..

# కార్మికుల జీవితాలతో ఆడుకుంటున్న సింగరేణి




గోదావరిఖని, ఆగస్టు 29 : కార్మికుల జీవితాలతో సింగరేణి యాజమాన్యం ఆడుకుంటుందని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆరోపించారు. సోమవారం గోదావరిఖని చౌరస్తాలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ చిరు వ్యాపారులకు షాపింగ్ కాంప్లెక్స్ ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు ఇవ్వలేదని, క్యాంపు కార్యాలయంలో సింగరేణి అధికా రులతో సమావేశాన్ని నిర్వహించడం ఆక్షేపనీయమ న్నారు. రెండేళ్లుగా చిరు వ్యాపారులు రోడ్డున పడ్డారని, నిర్మాణాలు ఇంకా పూర్తి కాలేదని, సింగరేణి యాజ మాన్యం నిర్మాణాలు జరిగే చోట ఇప్పటి వరకు పనులు అసంపూర్తిగా ఉన్నాయని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో సింగరేణి సంస్థ నిధులతో సిమ్స్ మెడికల్ కాలేజీని నిర్మించామని, అందులో 5శాతం సీట్లు సింగరేణి కార్మికుల పిల్లలకే దక్కేలా చేశామని గుర్తు చేశారు.

కార్మికుల క్వార్టర్లను కూల్చుతూ బలవంతంగా వారిని ఖాళీ చేయిస్తున్నారని ఆయన అన్నారు. సింగరేణి ఆస్తులపై సీఎండీ తక్షణమే స్పందించి బహిరంగ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు మిర్యాల రాజిరెడ్డి, కౌశిక హరి, నూనె కొమురయ్య, మురలీధర్‌రావు, మాదాసు రామమూర్తి, హరీష్‌రెడ్డి, సంతోష్ పాల్గొన్నారు.

# వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

### మంత్రి పొంగులేటి



సూర్యాపేట, ఆగస్టు 29: ధనిక తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా చేసినా సంక్షేమం ఆగలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈరోజు (శనివారం) మీడియాతో మాట్లాడుతూ.. జిల్లాలోని నూతనకల్, మద్దిరాల మండలాల్లో 15 గ్రామాల్లో సుమారు మూడు వేల ఎకరాలకు సంబంధించిన భూమి పట్టాలను అందజేస్తున్నామన్నారు. పిల్లల చదువు కోసం, అవసరాల కోసం భూమిని అమ్ముకొనే అవకాశం లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని తన దృష్టికి తీసుకవచ్చారని తెలిపారు. ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది కాబట్టే పట్టాదార్ పాస్‌బుక్కులను పంపిణీ చేస్తున్నామని చెప్పారు.'మీరు తలక్రిందులుగా తపస్సు చేసినా మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుంది' అని మంత్రి స్పష్టం చేశారు. 63 వేల కోట్ల ఆడబిడ్డలకు సున్నా వడ్డీకి రుణాలు ఇచ్చామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడత ఇందిరమ్మ ఇళ్లు అందించామని తెలిపారు. సర్వే కోసం 70 రెవెన్యూ గ్రామాలను తీసుకున్నామని.. ఈ సర్వేతో దొంగ పట్టాలను గుర్తించవచ్చని చెప్పారు. రాబోయే సంవత్సరన్నర కాలంలో ప్రతి అంగుళం సర్వే చేస్తామన్నారు. పేదలకు ఇళ్లు ఇస్తే ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారని ప్రతిపక్షాలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

# నేపాల్‌లో కొట్టుకొచ్చిన బ్యాంకు లాకర్..



- నగదు ఎత్తుకెళ్లిన స్థానికులు..
  రూ.58 లక్షలు స్వాధీనం

న్యూఢిల్లీ, ఆగస్టు 29 : నేపాల్‌లో ఆకస్మిక వరదల కారణంగా వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ఇంకా వందలాది మంది గల్లంతయ్యారు. ఇలాంటి సమయంలో మానవత్వంతో, బాధ్యతతో వ్యవహరించాల్సిన నేపాల్ ప్రజలు కొందరు తమ స్వార్థాన్ని బయటపెడుతున్నారు. తాజాగా ఒక నిర్లక్ష్యపు ఘటన వెలుగు చూసింది. నేపాల్‌లో ఒక బ్యాంకుకు చెందిన లాకర్ కొట్టుకురాగా.. అందులోంచి భారీగా నగదును స్తానికులు దోచుకున్నారు.అయితే, వారి నుంచి తర్వాత పోలీసులు ఆ నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన నేపాల్‌లోని దాడింగ్ జిల్లా, గల్చి రూరల్ మున్సిపాలిటీ పరిధిలో జరిగింది. స్థానిక మీడియా తెలిపిన వివరాల ప్రకారం.. రుసువాలో వరద సంభవించిన సంగతి తెలిసిందే. ఈ వరదల్లో ఒక బ్యాంకుకు సంబంధించిన లాకర్ కూడా కొట్టుకుపోయింది. ఈ లాకర్ త్రిశూలి నది వద్దకు చేరింది. దీంతో స్థానికులు ఈ లాకర్ బయటకు తీశారు. అందులోని 92,68,505 నేపాలీ రూపాయలు (రూ.58 లక్షల భారత కరెన్సీ)ని స్థానికులు దోచుకున్నారు. ఈ ఘటన బయటకు రావడంతో స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ లాకర్ నుంచి నగదు కొట్టేసిన 29 మంది నిందితుల్ని అరెస్టు చేశారు.వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. ఇంకా ఈ ఘటనలో ఎవరైనా ఉన్నారా.. ఇంకా నగదు మిగిలి ఉందా అనే ఘటనలపై విచారణ జరుపుతున్నారు. ఇప్పటివరకు నేపాల్ వరదల్లో 600 మందికి పైగా మరణించగా, 2,500 మంది గల్లంతయ్యారు. వీరిలో 537 మంది వరకు విదేశీయులున్నారు. ఇందులో 320 మంది భారతీయులు.

# కాంగ్రెస్ వైఫల్య పాలనపై బీఆర్ఎస్ సమరభేరికి సన్నద్ధం

## కాంగ్రెస్ వెయ్యి రోజుల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యాచరణ

## ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు నేతృత్వంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సమావేశం



హైదరాబాద్, ఆగస్టు 29 : కాంగ్రెస్ ప్రభుత్వ 1,000 రోజుల వైఫల్య పాలనపై బీఆర్ఎస్ సమరభేరికి నేతలందరూ సిద్ధమవుతున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ పిలుపుతో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో కార్యాచరణకు ప్రణాళికలను రూపొందిస్తున్నారు.జిల్లాలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు.. ఎమ్మెల్యేలు చామకూర మల్లారెడ్డి, మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానంద్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి తదితరులతో సమవేశమయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల పరిస్థితి, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లే అంశాలపై సమావేశంలో చర్చించారు.

# సూర్యాపేటలో విషాదం.. గొడ్డలితో దాడి.. ఇద్దరి మృతి




సూర్యాపేట జిల్లా, ఆగస్టు 29 : ఈత చెట్టు విషయంలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణ తీవ్ర విషాదానికి దారితీసింది. సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలం ఎర్రగడ్డ తండాలో పాత కక్షలు, ఇంటి పక్కన ఉన్న ఈత చెట్టు వివాదం నేపథ్యంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఓ వ్యక్తి గొడ్డలితో దాడి చేయడంతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రగడ్డ తండాలో ఈత చెట్టు విషయంలో కొంతకాలంగా ఇరువర్గాల మధ్య వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. మాటామాటా పెరగడంతో ఘర్షణకు దారితీసింది. ఈ ఘటనలో మంద వెంకటేశ్వర్లు (62) అక్కడికక్కడే మృతిచెందాడు. అడ్డుకోబోయిన తండ్రి సైదాపై గొడ్డలితో పెద్దబాబు అనే వ్యక్తి గొడ్డలితో దాడి చేశాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సైదా (58) మృతిచెందాడు. ఈ ఘటన అనంతరం నిందితుడు పెద్దబాబును గదిలో బంధించి పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. పెద్దబాబును అదుపులోకి తీసుకునే సమయంలో ఎస్ఐ నవీన్‌పై పెద్దబాబు దాడి చేశాడు. ఈదాడిలో ఎస్ఐ తలకు గాయాలయ్యాయి. దీంతో ఎర్రగడ్డ తండాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీగా మోహరించారు. ఇరువర్గాల మధ్య పాత కక్షలు కూడా ఈ ఘర్షణకు కారణమై ఉండవచ్చని స్థానికులు చెబుతున్నారు. అయితే అసలు ఘర్షణకు దారితీసిన కారణాలు, దాడి జరిగిన తీరు, నిందితుడి పాత్రపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న పెద్దబాబు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరిస్తున్నారు. ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించే ప్రక్రియ చేపట్టినట్లు తెలుస్తోంది. ఈత చెట్టు వివాదం, పాత కక్షల నేపథ్యంలో జరిగిన ఈ ఘటనతో ఎర్రగడ్డ తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఎలాంటి ఉద్రిక్తతలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నారు.

# సంక్షేమ పథకాలు అందించంలో ప్రభుత్వం ఆదర్శం



ఇల్లంతకుంట, ఆగస్టు 29 : సంక్షేమ పథకాలు అందించడంలో ప్రభుత్వం ఆదర్శంగా నిలు స్తున్నదని మాన కొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని ఇల్లంత కుంట, వల్లంపట్ల తదితర గ్రామాల్లో శనివారం అభి వృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భం గా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుపేదలయిన ప్రతిఒక్కరి ఇంటి నిర్మాణం చేయిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలన్నదే సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యంఅన్నారు. అర్హులైన ప్రతికుటుంబానికి రేషన్‌కార్డులు మంజూరు చేయడమే కాకుండా స్మార్ట్ కార్డులు పంపిణీ చేశామన్నారు. సంక్షేమపథకాలు అమలు చేయడమే కాకుండా అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తు న్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాలు అర్హులకు అందా లని అప్పుడే అభివృద్ధి సాధ్యం అవుతుం దన్నారు. అన్ని గ్రామాలలో మహిళలకు సంఘభవనాలను నిర్మిస్తున్నామని, మహిళలు విద్యా వంతులు కావాలని సూచించారు. కార్యక్రమంలో మండలప్రత్యేక అధికారి రామకృష్ణ, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు మామిడి రాజు, ఫ్యాక్స్‌చైర్మన్ రమణారెడ్డి, డైరెక్టర్ ఒగ్గు రమేష్, తహసీల్దార్ రాచ కట్ల సురేష్, ఎంపీడీవో శశికళ, డీ సాజిద్, సర్పంచ్‌లు నేరెళ్ల విజయ్‌గౌడ్, కాతమల్లేశం, చల్ల నవీన్ రెడ్డి, చొప్పరి భూమయ్య, నాయకులు పసుల వెంకటి, ఎలగందుల ప్రసాద్, తిరుపతి, తూముకుంట రాజేం దర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డిలతో పాటు వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

### అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం..

మండలంలోని వల్లంపట్ల గ్రామంలో మహిళా సంఘ భవనాన్ని, ఇల్లంతకుంటలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నోట్‌బుక్కులను పంపిణీ చేశారు. మహిళా సంఘ భవనానికి స్థలాన్ని ఇచ్చిన కట్ట సౌమ్యశ్రీకాంత్‌రెడ్డిని అభినందించారు. విద్యార్థులు అంకితభావంతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. వల్లంపట్ల గ్రామంలో మధ్యమానేరు కుడికాలువ ద్వారా నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని విన్నవించారు. అధి కారులతో మాట్లాడి నీటివిడుదలకు కృషిచేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేవరాజం, ఎమ్ఎస్ అధ్యక్షురాలు కట్ట సౌమ్య, సూపరవైజర్లు చంద్రకళ, ఉమారాణి, నాయకులు పాల్గొన్నారు.

# నీట్ - పీజీకి పకడ్బందీ ఏర్పాట్లు



హైదరాబాద్, ఆగస్టు 29: నీట్-పీజీ 2026 పరీక్షను ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శనివారం డీసీపీ రాంరెడ్డితో కలిసి పెద్దకల్వలలోని మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల, పెద్దపల్లిలోని ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాల, రామగిరి మండలం సెం టినరీ కాలనీలోని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలల్లో ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆది వారం నిర్వహించనున్న పరీక్ష ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతుందని తెలి పారు. అభ్యర్థులను 7.30 నుంచి 8.45 గంటల వరకు మాత్రమే కేంద్రాల్లోకి అనుమతిస్తామని చెప్పారు. ఒరిజినల్ ఫొటో గుర్తింపు కార్డు, ఎంబీబీఎస్ క్వాలిఫి కేషన్ సర్టిఫికెట్, అడ్మిట్ కార్డు తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా, వైద్య సదుపాయాలు కల్పించాలని, పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశిం చారు. సీసీటీవీ నిఘా, మొబైల్ జామర్లు, హెచ్‌హెచ్ఎండీ, మాన్యువల్ బాడీ ఫ్రిస్కింగ్ ద్వారా భద్ర తా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎలక్ట్రానిక్ వస్తువులు, గడియారాలు, ఆభరణాలు, షూస్‌కు అనుమతి లేదని స్పష్టం చేశారు. పరీక్ష పర్యవేక్షణకు రెండు ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రశ్నపత్రం ఐదు టైమ్‌బౌండ్ సెక్షన్లుగా ఉంటుందని, ఒక్కో సెక్షన్‌కు 42 నిమిషాల సమయం ఉంటుందని పేర్కొ న్నారు. పరీక్ష ప్రారంభానికి ముందు రిజిస్ట్రేషన్ పూర్త యిన తర్వాత బయో బ్రేక్‌కు అనుమతి ఉండదన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి పరీక్షను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆర్డీవో గంగయ్య, తహసీల్దార్లు రాజయ్య, బషీరుద్దీన్, సుమన్, నిర్వాహకులు, అధికారులు పాల్గొన్నారు.

# సురేఖ ఇంటికే!.. 3 తర్వాత మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ..

- సన్నిహితుల వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవేదన!



హైదరాబాద్, ఆగస్టు 29: : తెలంగాణ కాంగ్రెస్‌లో రాజకీయ వేడి మరింత పెరుగుతోంది. ఓవైపు మంత్రి కొండా సురేఖ వ్యవహారం క్రమశిక్షణ కమిటీ నుంచి ఏఐసీసీ వద్దకు చేరి ఉత్కంఠ రేపుతుండగా, మరోవైపు పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. ఈ పరిణామాల నేపథ్యంలో సెప్టెంబరు 3న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను ఢిల్లీకి రావాల్సిందిగా అధిష్ఠానం కోరినట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. విదేశీ పర్యటనలో ఉన్న ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జి కేసీ వేణుగోపాల్ సెప్టెంబరు 1న ఢిల్లీకి తిరిగి రానున్నట్లు, అనంతరం ఈ వ్యవహారాలపై దృష్టి పెట్టనున్నట్లు సమాచారం. మూడో తేదీన జరగనున్న చర్చల్లో కొండా సురేఖ వ్యవహారంతోపాటు మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై కూడా కీలక నిర్ణయాల దిశగా కసరత్తు జరగవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొండా సురేఖ వివాదానికి సంబంధించి టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ నివేదిక ఇప్పటికే ఏఐసీసీకి చేరింది. దీనిపై అదిష్ఠానం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అయినా.. సీఎం, డిప్యూటీ సీఎం, పీసీసీ చీఫ్‌ను ఢిల్లీకి పిలిపిస్తుండడంతో కేవలం కొండా సురేఖపై చర్యల విషయంలో నిర్ణయం తీసుకోవడానికేనా? లేక మొత్తంగా మంత్రివర్గంలో మార్పులు, పార్టీ వ్యవహారాలపై సమగ్ర చర్చ కోసమా? అన్న చర్చ కాంగ్రెస్ వర్గాల్లో జరుగుతోంది.

# గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ విఫలం

## నందగోకుల్-చల్మెడ రోడ్డు నిర్మించాలి: పద్మాదేవేందర్‌రెడ్డి

## నందగోకుల్ నుంచి పాదయాత్ర

## పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ శేరి, మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల



మెదక్, ఆగస్టు 29 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చే యడంలో ఘోరంగా విఫలమైందని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి అన్నారు. మెదక్ జిల్లా నిజాంపేట మండలం నందగోకుల్ నుంచి చల్మెడ వరకు బీటీ రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం 8 కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టారు. పాదయాత్రకు ప్రజలు దారి పొడువునా స్వాగతం పలికారు. మార్గ మధ్యంలో వ్యవసాయ కూలీలు, ప్రజలు వీరికి హారతులు ఇచ్చి స్వాగతించా రు. ఈ సందర్భంగా పద్మాదేవేం దర్‌రెడ్డి మా ట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం నందగోకు ల్ గ్రామం నుంచి చల్మెడ కమాన్ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. 13 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. తర్వాత కాంగ్రెస్ ప్రభు త్వం అధికారంలోకి వచ్చాక పనులు నిలిపివేసిందని ఆరోపించారు. కక్షపూరితంగా ప్రభు త్వం బీటీ రోడ్డు పనులు అడ్డు కుంటున్నదని విమర్శించారు. మాజీ ఎమ్మెల్సీ శేరి సుభా శ్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభు త్వం నిధులు కేటాయించడం లేదని మండిపడ్డారు. మళ్లీ కేసీఆర్‌ప్రభుత్వం రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

# (మొదటిపేజీ తరువాయి)

## పిచ్చోడి చేతిలో రాయిలా రేవంత్ పాలన

ఎకరాల భూములు నిషేధిత జాబితాలో పెట్టారని తెలిపారు. వాటికి సంబంధించిన భూ వివరాలను బాధితులు.. ఎమ్మెల్యే హరీశ్‌రావుకు చూపించారు. పటాన్‌చెరు అంటేనే మధ్యతరగతి, పేద ప్రజలు, చిరుద్యోగుల ఉండే ప్రాంతం అని అన్నారు. ఏ పాపం తెలియని వీరి మీద కాంగ్రెస్ ఎందుకు ఇంత కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ప్రశ్నించారు. భూములు నిషేధిత జాబితాలో పెడితే వారికి రైతుబంధు, రైతుబీమా రాదన్నారు. ఈ దుర్మార్గం కేవలం పటాన్‌చెరుకు మాత్రమే పరిమితం కాలేదని జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, కత్బుల్లాపూర్, మలక్‌పేట, ఉప్పల్ ఇలా హైదరాబాద్ చుట్టుపక్కల ఏ ప్రాంతానికి వెళ్లినా.. లక్షల ఆస్తులు 22ఏ జాబితాలో పెట్టారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇండ్లు 22ఏ జాబితా నుంచి తొలగించినట్లుగానే ప్రజలందరి భూములను తొలగించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. మంత్రి పొంగులేటి తప్పు చేస్తే ప్రజలు ఎందుకు శిక్షను అనుభవించాలని అన్నారు. 22ఏ దందాతో మీకు సంబంధం లేకపోతే వెంటనే పొంగులేటిని మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. అధికారులే పొరపాటు చేస్తే వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. జీవో 58, 59 కింద ఒక్క పటాన్ చెరులో 9వేల మందికి పైగా పేదలకు ఇండ్ల పట్టాలు ఇచ్చి రూపాయి ఖర్చు లేకుండా వాళ్లను కేసీఆర్ ఓనర్లను చేశారని అన్నారు. సూర్యుని చుట్టూ భూమి తిరిగినట్లు రేవంత్ రెడ్డి కేవలం భూముల చుట్టూనే తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజల పక్షాన సంగారెడ్డి కలెక్టర్‌ను హెచ్చరిస్తున్నామని వారం రోజుల్లో 50వేల ఎకరాలను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని, లేదంటే బాధితులతో కలిసి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ను ముట్టడిస్తామన్నారు. వంటావార్పు చేసి అక్కడే బైఠాయిస్తామన్నారు.

## 420 మోసాలపై.. బీఆర్ఎస్ పోరుబాట

వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. సూర్యాపేటలో జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో నిరంతర విద్యుత్తు, పుష్కలంగా సాగునీరు పొందిన తెలంగాణ నేడు కాంగ్రెస్ పాలనలో మళ్లీ చీకట్లోకి జారుకున్నదని పేర్కొన్నారు. రాష్ట్రంలో కొత్తగా ఒక ప్రాజెక్టు కానీ, మౌలిక వసతుల కల్పన కానీ జరుగలేదని, కేవలం పాత పథకాలకు పేర్లు మారుస్తూ కాలయాపన చేస్తున్నారని ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ వైఫల్యాలపై విడుదల చేసే చార్జ్‌షీట్ ద్వారా ప్రజలకు నిజాలు వివరిస్తామని చిట్‌చాట్‌లో తెలిపారు. రూ.12వేల కోట్లకు పైగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బాకీలు చెల్లించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల, విద్యాసంస్థల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నదని చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రహీంపల్లిలో జరిగిన సమావేశంలో సబితాఇంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. సెప్టెంబర్ 5న విద్యార్థులు, యువతతో కలిసి చేపట్టే భారీ ర్యాలీల్లో కాంగ్రెస్ వైఖరిని ఎండగడుతామని స్పష్టంచేశారు. గౌడ, యాదవ, ముదిరాజ్, ఇతర చేతివృత్తుల సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా పకనబెట్టిందని శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. మహబూబ్‌నగర్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో అందిన సంక్షేమ ఫలాలు నేడు బంద్ అయ్యాయని పేర్కొన్నారు. ప్రభుత్వం వంద రోజుల్లోనే వ్యవసాయాన్ని మళ్లీ సంక్షోభంలోకి నెట్టిందని నిరంజన్‌రెడ్డి ధ్వజమెత్తారు. విత్తనాలు, యూరియా కొరత నుంచి పంటల కొనుగోలు వరకూ ప్రతి దశలోనూ రైతులు పడుతున్న ఇబ్బందులను ప్రజల ముందుకు తీసుకెళ్తామని స్పష్టంచేశారు.

## ఎల్‌నినోతో కాదు..ముమ్మాటికీ కాంగ్రెస్ సృష్టించిన కరువే

మంచిగున్నాయని సెంట్రల్ వాటర్ కమిషనే స్పష్టంగా తెల్చింది. 75 రోజుల్లో గోదావరిలో 150 టీఎంసీ నీళ్లను వృథాగా సముద్రం పాలు చేశారని మండిపడ్డారు. కృష్ణాలో 150 టీఎంసీల నీటిని ఆంధ్రా పాలు చేశారని ఆరోపించారు. ఆంధ్ర సీఎం అనధికార ఉత్తరులతో అక్రమంగా నీళ్లను దోచుకు పోయారని విమర్శిం చారు. వంద శాతం రేవంత్ రెడ్డి అనుమతితోనే జరుగుతుందని పేర్కొన్నారు. కేవలం బీఆర్ఎస్ పార్టీ ఒత్తిడితోనే సాగర్ గేట్లు కొంతమేరా వదిలిపెట్టారని వివరించారు. కుడికాలువకు నీళ్లిచ్చి ,ఎడమ కాలువకు ఎందుకు ఇస్తలేరని మంత్రులకు అడిగే సోయికూడా లేదని తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో రైతాంగానికి న్యాయం జరిగే వరకు పోరాడుతూనే ఉంటామని వెల్లడించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీ బడుగు లింగయ్య యాదవ్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వై వెంకటేశ్వర్లు, నియోజకవర్గం ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## జీవో 97ను రద్దు చేయాలి

విద్యార్థులకు లేని అపోహలు ఏర్పడుతున్నాయి. మేం ఇంజినీరింగ్ చదువుకున్నాం.. లేబర్ డిపార్ట్‌మెంట్‌కు పోతమా..? అనే లేని అపోహ వాళ్ల మనసులోకి వచ్చింది. స్కిల్ యూనివర్సిటీకి దీన్ని అనుసంధానం చేసి పాలిటెక్నిక్ విద్యతోపాటు కొన్ని స్కిల్స్ నేర్పిస్తే వాళ్లకు వెంటనే ఉద్యోగాలొస్తయని ఆలోచన ప్రభుత్వం చేసి.. కానీ విద్యార్థులంతా కూడా మేం లేబర్ డిపార్ట్‌మెంట్‌లోకి వెళ్లం. రేపు పాలిటెక్నిక్ అయిపోతే ఇంజినీరింగ్ పోవాల్సినోళ్లం.. వైట్ కాలర్ జాబ్ చేయాల్సినవాళ్లమే తప్ప మేం కిందికి పోమనే ఆలోచనలో ఉన్నరు.. వాళు కూడా కరెక్టే.. కాబట్టి నేను ప్రభుత్వాన్నికోరుతున్నానన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యను పరిష్కరించేందుకు ఒక కమిటీ కూడా వేశారు. ఆ కమిటీ వీటన్నింటిని కూడా అధ్యయనం చేస్తున్నది.. నేను ఆ కమిటీకి సూచించేది ఒకటే. పాలిటెక్నిక్ విద్యార్థులను టెక్నికల్ ఎడ్యుకేషన్‌లోనే కొనసాగించాలి. పాలిటెక్నిక్ పూర్తయిన తర్వాత ఇంజనీరింగ్ వెళ్లడానికి లేటరర్ ఎంట్రీని కూడా ఉంచండి. వాళ్లను దేశవ్యాప్తంగా పాలిటెక్నిక్స్ ఎలా ఉన్నాయో అవన్నీ ఏఐసీటీఈ కింద ఉన్నాయి. మన రాష్ట్రంలో కూడా అదే పద్ధతి కొనసాగితే బాగుంటుంది. ఆ విద్యార్థులు ఒక రకమైన అపోహలో, భయాందోళనలో ఉన్నారు. వాళ్ల అపోహలను నివృత్తి చేయాల్సిన అవసరముందన్నారు.

## రేవంత్ రెడ్డి మాటల్నిసీరియస్‌గా తీసుకోవద్దు..



అమలు కావడం లేదని పీసీసీ అధ్యక్షుడు అంగీకరించారు. ఉమ్మడి వరంగల్ పర్యటనలో భాగంగా పరకాల సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మరోసారి రేవూరి ప్రకాశ్ రెడ్డికే టికెట్ ఖాయమని అన్నారు. దాంతో.. మంత్రి కొండా సురేఖ కూతురు కొండా సుస్మిత 2028లో నేనే పరకాల ఎమ్మెల్యే అని సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టింది. ఆమె పోస్ట్‌పై.. కొండా సురేఖపై పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేలు అభ్యంతరం వ్యక్తం చేశారు. సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు కూడా. ఈ నేపథ్యంలో పీసీసీ చీఫ్.. అదేం లేదని చెప్పడం గమనార్హం.

## గోల్ఫ్ టూరిజం హబ్‌గా తెలంగాణ



పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానాన్ని అనుసరించనున్నట్టు తెలిపారు. తెలంగాణ గోల్కొండ మాస్టర్స్ 12వ ఎడిషన్ సందర్భంగా శనివారం గోల్కొండలోని హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. డీపీ వరల్డ్ ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్ ఆఫ్ ఇండియా (డీపీ వరల్డ్ పీజీటీఐ), హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ టోర్నీకి ఈవెంట్ పార్ట్‌నర్‌గా తెలంగాణ టూరిజం వ్యవహరిస్తున్నది. తెలంగాణ గోల్కొండ మాస్టర్స్ కేవలం క్రీడా పోటీ మాత్రమే కాదనీ, అంతర్జాతీయ గోల్ఫ్‌ను తెలంగాణ పర్యాటక, వారసత్వ సంపదతో అనుసంధానించే వేదిక అని జూపల్లి అన్నారు. గోల్కొండ కోట సమీపంలోని గోల్ఫ్ కోర్సులో ఈ టోర్నీ నిర్వహించడం రాష్ట్ర చరిత్ర, వారసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేసే అవకాశం దక్కిందన్నారు. హైదరాబాద్ నగరానికే తెలంగాణ పర్యాటకం పరిమితం కాదనీ, రాష్ట్రంలోని సరస్సులు, అడవులు,గోదావరి,కృష్ణానదులు,రాజభవనాలు,కోటలు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయని చెప్పారు.

# భూ భారతి చట్టం ద్వార వివాద రహిత భూములకు పట్టాదారు పాసు పుస్తకాలు

- నూతనకల్‌లో 1061 మంది రైతులకు
- 1044 ఎకరాలకు పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ
- మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**హైదరాబాద్, ఆగస్టు 29 :** రానున్న సంవత్సర కాలంలో రాష్ట్రవ్యాప్తంగా వివాదరహిత భూములన్నిటీని ప్రతి అంగుళాన్ని సర్వే చేసి భూ ఆసాములకు పట్టాలు ఇస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలి పారు. శనివారం అయన సూర్యాపేట జిల్లా, నూతనకల్ మండల కేంద్రంలో నూతనకల్, మద్దిరాల మండలాలకు సం బంధించి దశాబ్దాల తరబడి పెండింగ్ లో ఉన్న 15 గ్రామాల లోని 1061 మంది రైతులకు 1044 ఎకరాలకు పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ సాగు చేసుకుంటున్న భూములకు ఏళ్ళ తరబడిగా పట్టాలు లేక రైతులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని, దాని ద్వారా వివాద రహిత భూములన్నింటికీ పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో తాతలనాటి నుండి వస్తున్న భూ సమస్యలకు భూ భారతి ద్వారా పరిష్కారం చేస్తున్నామన్నారు. భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రతి అంగుళం భూమిని అధికారులు సర్వే చేసి నిజమైన ఆసాములకు హక్కు పత్రాలు అందించేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నదని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో మొదటి విడతన 70 గ్రామాలను ఎంపిక చేసుకొని సర్వే చేయించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో పలుచోట్ల రెవెన్యూ, దేవాదాయ, అస్సైన్డ్ భూములు కబ్జాకు గురవుతుండడం తమ దృష్టికి వచ్చిందని,వీటిని అరికట్టేందుకు తాము కఠిన చర్యలు తీసుకుంటున్నామని, అందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా రానున్న సంవత్సరకాలంలో ప్రతి అంగుళాన్ని సర్వే చేస్తామని, వివాదారహిత భూములన్నింటికీ పట్టాదారు పాసుపుస్తకాలు ఇస్తామని పునరుద్ఘాటించారు. పంచాయతీలేని భూములకు, భూములున్న ఆసాములు అందరికీ పట్టాలిస్తామన్నారు. గత ప్రభుత్వం 8 లక్షల ఇరవై ఒక్క వేల కోట్ల అప్పును తమ ప్రభుత్వం పై మోపినప్పటికీ తల తాకట్టు పెట్టైనా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అపకూడదన్నదే తమ ఉద్దేశమని, సంక్షేమ కార్యక్రమాలు కుంటు పడకుండా తమ ప్రభుత్వం అమలు చేస్తున్నదని, అందులో భాగంగానే రైతులకు కూడా న్యాయం చేయాలన్న సంకల్పంతో ముందుకు వెళుతున్నట్లు వెల్లడించారు. గత ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పట్టాలు ఇవ్వలేదని, ఇప్పుడు ముసలి కన్నీరు కారుస్తున్నదని అన్నారు. గడచిన రెండున్నర సంవత్సరాలలో రాష్ట్రంలో మహిళలకు 63 వేల కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలు ఇచ్చామని, రానున్న రెండున్నర ఏళ్లలో కూడా అంతే రుణాలు ఇస్తామని ,200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, మహిళలకు ఉచిత బస్సు, సన్నబియ్యం, రేషన్ కార్డులు పంపిణీ చేసిన ఘనత తమదేనని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకానికి జనం బ్రహ్మ రథం పడుతున్నారని, హైద్రాబాద్ లో కోట్ల రూపాయల విలువచేసే భూములలో ఇందిరమ్మ టవర్స్ నిర్మించి ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గానికి మొదటి విడత,3500,రెండో విడత 2000 ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చామని, మూడవ ,నాలుగో విడతల్లో కూడా ఇస్తామని, ప్రతి నియోజకవర్గంలో అర్హులైన పేదవారందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని మంత్రి వెల్లడించారు. రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ దశాబ్దాల రైతుల సమస్యలకు పరిష్కారం పట్టాలు ఇవ్వడమని అన్నారు. భూమికి హక్కు ఉంటే రైతుకు ధైర్యం ఉంటుందని, రైతులకు రైతు భరోసా, రైతుబంధు, భీమా, ఇతర లబ్ధి చేకూరుతుందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా 5 లక్షల రూపాయలు ఇచ్చిన దాఖలాలు లేవని, రాష్ట్రవ్యాప్తంగా 36వేల కోట్ల రూపా యలతో హ్యాం రోడ్లను నిర్మిస్తున్నామని, తుంగతుర్తి నియోజకవర్గానికి 100 కోట్ల రూపాయలతో రోడ్లు మంజూరు చేయడం జరిగిందని, మరో 200 కోట్ల రూపాయల ప్రతిపాదనలు ఉన్నాయని వెల్లడించారు. అలాగే సూర్యాపేట నియోజకవర్గం లోని అన్ని గ్రామాలకు డబుల్ రోడ్లను వేస్తామని తెలిపారు. ప్రజలకు సన్నబియ్యం, రైతు భరోసా, రైతుబంధు ఇస్తున్నామని, ఇందిరమ్మ ఇండ్లను ఎట్టి పరిస్థితులలో ఆపమని, గుడిసె ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి గుడిశలేని తెలంగాణగా మారుస్తామన్నారు. భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడమే ప్రజాపాలన అని,గత కొన్ని సంవత్సరాలుగా పరిష్కారం కానీ రైతుల సమస్యలు పట్టాల పంపిణీతో ఇప్పుడు పరిష్కారం అయ్యాయని, తమ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఉచిత బస్సు వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని, ప్రజలు వీటన్నిటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు మాట్లాడుతూ పొలాలను సాగు చేసుకుంటున్న రైతులకు హక్కులు లేనందువల్ల ఎన్నో బాధలకు గురయ్యారని, అలాంటి 60 సంవత్సరాల సమస్య తీర్చినందుకు రెవెన్యూ మంత్రికి రాష్ట్ర ముఖ్యమంత్రి కి కృతజ్ఞతలు తెలిపారు. పట్టాల పంపిణీతో రైతులు వారి భూములకు హక్కుదారులు అయ్యారని, గతంలో కేంద్రంలో ఉన్న తమ ప్రభుత్వం 25 లక్షల ఎకరాల భూములకు పట్టాలు ఇచ్చిన ఘనత తమకే దక్కిందని, రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కూడా హక్కు పత్రాలు ఇవ్వడం జరిగిందని, భూమి అనేది రైతుకు ఆత్మ గౌరవం అని ,భూమి హక్కు లేకుంటే గుర్తింపు ఉండదని అన్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలో పెండింగ్లో ఉన్న రోడ్లను మంజూరు చేయాలని, తుంగతుర్తి నియోజకవర్గానికి అదనంగా ఇండ్లు మంజూరు చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ మాట్లాడుతూ దేశంలో సీలింగ్ చట్టం వచ్చిన తర్వాత కూడా అంతకుముందు ఉన్న వివిధ కారణాలవల్ల పట్టాలు రాని వారు రైతుబంధు, రైతు బీమా, రైతు భరోసా, రుణాలు, విత్తనాలు వంటివి రాక అనేక ఇబ్బందులు పడ్డారని, వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని వీటి పరిష్కారానికై రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని, ఇందులో భాగంగా నూతనకల్ మద్దిరాల మండలాలలోని 15 గ్రామాలలో 3000 ఎకరాలకు పైగా భూములన్ని సర్వే చేసి పరిశీలించి రైతుల పొలాల వద్దకు వెళ్లి వారికి నోటీసులు ఇచ్చిన పిదప ముసాయిదా అర్హుల జాబితాను ప్రకటించడం జరిగిందని , సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇవ్వడం జరుగుతున్నదని ,ఈ రెండు మండలాలలో 1060 మంది రైతులకు 1044 ఎకరాలకు పట్టాల పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. వీటితోపాటు భూభారతి కింద రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు కూడా ఇస్తున్నామని, ఖాతాలు లేని వారికి కూడా కొత్తగా ఖాతాలు ఇస్తున్నట్టు వెల్లడించారు. రాష్ట్ర రెవెన్యూ,సిసి ఎల్ ఏ సెక్రటరీ లోకేష్ కుమార్, ల్యాండ్ సర్వీస్ సెటిల్మెంట్ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అడిషనల్ కలెక్టర్ హరి సింగ్ ,ఆర్డీవోలు, తహసిల్దారులు, రైతు కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న, మార్కెట్ కమిటీ చైర్మన్లు, వివిధ మండలాల ప్రజాప్రతినిధులు, తదితరులు ఉన్నారు.

## 'పాలిటెక్నిక్'తో ప్రయోగాలొద్దు

- 'శక్తి'లో వద్దు.. సాంకేతిక విద్యా శాఖలోనే కొనసాగించాలి
- విలీనంపై టీపీ జేఏసీ అభ్యంతరం
- జీవో -97 ఉపసంహరించుకునే వరకు పోరాడుతామని వెల్లడి
- సచివాలయంలో జేఏసీ నేతలతో హైలెవల్ కమిటీ సంప్రదింపులు



**హైదరాబాద్, ఆగస్టు 29 :** పాలిటెక్నిక్ విద్యను 'శక్తి' శాఖలో విలీనం చేసే ప్రతిపాదనపై తెలంగాణ పాలిటెక్నిక్ యాక్షన్ కమిటీ(టీపీ జేఏసీ) అభ్యం తరం వ్యక్తం చేసింది. కాలేజీలను యంగ్ ఇండి యా స్కిల్ యూనివర్సిటీ, ఉద్యోగులను కార్మిక శాఖ లో విలీనం చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. దశాబ్దాల చరిత్ర గల డిప్లొమా విద్యను మింగే స్తారా..? అంటూ ప్రశ్నించింది. విలీనం చేస్తే టెక్నిక్ ఎడ్యుకేషన్‌కు టాటా చెప్పినట్టేనని, పాలిటెక్నిక్ విద్యతో ప్రయోగాలు వద్దని కోరింది. ఈ విషయంపై విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన నెలకొన్నదని ప్రస్తావించింది. జీవో 97ను ఉపసంహరించుకునే వరకు శాంతి యుతంగా పోరాడుతామని జేఏసీ స్పష్టంచేసింది. పాలిటెక్నిక్ విద్య ఆధునికీకరణ, విద్యార్థులు -- విద్య, ఉద్యోగ ప్రయోజనాల పరిరక్షణపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీ శనివారం సచివాలయంలో భేటీ అయ్యింది. ఈ సందర్భంగా టీపీ జేఏసీ ప్రతినిధులతో సంప్రదింపులు జరిపింది. జేఏసీ చైర్మన్ నాగరాజు, సెక్రటరీ జన రల్ శ్రావణ్‌కుమార్ తదితరులు కమిటీ ముందు పలు వాదనలు వినిపించారు. జీవో -97లో నా లుగో పాయింట్ తీవ్ర అభ్యంతరకరమని, దీంతోనే ఆందోళన నెలకొన్నదని అభిప్రాయపడ్డారు. పాలిటెక్నిక్‌ను శక్తిశాఖలోకి కాకుండా సాంకేతిక విద్యలోనే కొనసాగించాలని జేఏసీ స్పష్టంచేసింది. ప్రస్తుత విద్యాశాఖ పరిధిలో కొనసాగితే విద్యా ప్రమాణాలు, నియంత్రణకు అకాశముంటుందని, డిప్లొమా విద్యార్థుల భవిష్యత్తు ప్రయోజనాలను రక్షించవచ్చని ప్రస్తావించింది. పాలిటెక్నిక్ విద్యకు సంబంధించిన అకడమిక్ వ్యవహారాలు, పరీక్షలు, డిప్లొమా సర్టిఫికేషన్ బాధ్యతలను నిర్వహిస్తున్న సాంకేతిక విద్యామండలిని (ఎస్‌బీటెట్) యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేసింది. అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) నిబంధనలకు అనుగుణంగా ఎడ్యుకేషన్ యాక్ట్ కింద ఏర్పాటైె ఈ సంస్థ పనిచేస్తున్నదని కనుక మండలిని రద్దు చేయవద్దని కోరింది. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా విలీనాన్ని వ్యతిరేకిస్తూ పాలిటెక్నిక్ కాలేజీల్లోని అధ్యాపకులు, విద్యార్థులు నిరసనలు కొనసాగిస్తున్నారు.

## సంప్రదించకుండా ముందుకెళ్లం

### కే కేశవరావు



**హైదరాబాద్, ఆగస్టు 29 :** పాలిటెక్నిక్ విద్యార్థులు, ఉద్యోగుల జేఏసీలను సంప్రదించకుండా ఏ నిర్ణయం తీసుకోబోమని హై లెవల్ కమిటీ చైర్మన్, ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు స్పష్టం చేసినట్టు జేఏసీ నేతలు వెల్లడించారు. జేఏసీ వాదనలు సహేతుకంగా ఉన్నాయని అందరి అభిప్రాయాలను క్రోడీ కరించి ముందుకెళ్తామని హామీనిచ్చినట్టు చెప్పారు. విద్యావ్యవస్థలో మార్పులు విద్యార్థులకు నష్టం వాటిల్లే విధంగా ఉండకూడదని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అభిప్రాయపడగా, కమిటీ సభ్యురాలు శాంతాసిన్హా స్పందిస్తూ. పాలిటెక్నిక్ విద్య పేద, బడుగు, బలహీన విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దే విద్య అని కొనియాడినట్టు జేఏసీ నేతలు తెలిపారు. ఈ అంశంపై మరిన్ని సమావేశాలు నిర్వహిస్తామని, విద్యార్థులు, అధ్యాపకులను సంప్రదించకుండా ఒక్క అడుగు కూడా ముందుకు వేయబోమని తమకు చెప్పినట్టు నేతలు వెల్లడించారు.

## ముందుగా కమిటీకి ఎథిక్స్ ఉండాలి!..

- కౌశిక్‌రెడ్డిపై ఏకపక్షంగా వ్యవహరించొద్దు
- కాంగ్రెస్ ఎమ్మెల్యేల అభిప్రాయాలను 'మూడ్ ఆఫ్ ది హౌస్'గా ఎలా పరిగణిస్తరు?
- సభలో అనుచితంగా మాట్లాడిన సీఎం రేవంత్, సామేలు, దానం సహా అందరినీ కమిటీ పిలువాలి
- కౌశిక్‌రెడ్డికి జవాబు చెప్పుకొనే అవకాశం ఇవ్వాలి
- మీడియాతో ఎథిక్స్ కమిటీ సభ్యుడు ప్రశాంత్‌రెడ్డి



**హైదరాబాద్, ఆగస్టు 29 :** సీఎం రేవంత్‌రెడ్డి వాడు తున్న అసభ్య పదజాలంపై అసెంబ్లీ ఎథిక్స్ కమిటీలో చర్చించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే, ఎథిక్స్ కమిటీ సభ్యుడు వేముల ప్రశాంత్‌రెడ్డి డిమా ండ్ చేశారు. ముందు ఎథిక్స్ కమిటీకి ఎథిక్స్ ఉం డాలని, కేవలం కాంగ్రెస్ సభ్యుల అభిప్రాయాల ఆధా రంగా హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యల అంశాన్ని కమిటీ ఎజెండాలో చేర్చడం సరికాదని పేర్కొ న్నారు. అసెంబ్లీలో అనుచితంగా మాట్లాడిన అధికార పార్టీ ఎమ్మె ల్యేలను కూడా విచారించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సమయంలో సీనియర్ సభ్యుడు, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై పాడి కౌశిక్‌రెడ్డి అనుచితంగా ప్రవర్తించారనే ఆరోపణలపై అసెంబ్లీలోని కమిటీ హాల్‌లో చైర్మన్ రేవూరి ప్రకాశ్‌రెడ్డి అధ్యక్షతన ఎథిక్స్ కమిటీ శనివారం సమావేశమైంది. బీఆర్ఎస్ సహా వివిధ పార్టీల సభ్యులు హాజరై తమ అభిప్రాయాలు వెల్లడించారు. బీఆర్ఎస్ తరఫున మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి హాజర య్యారు. కమిటీ సమావేశం ముగిసిన అనంతరం బీఆర్ఎస్‌ఎల్పీ కార్యాలయంలో వేముల ప్రశాంత్‌రెడ్డి మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. పాడి కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలపై వివాదం జరిగిన రోజు 23మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో మాట్లాడించారని తెలిపారు. వారి అభిప్రాయాలను మాత్రమే ఆధారంగా తీసుకుని 'మూడ్ ఆఫ్ ది హౌస్'గా పేరొనడం సరికాదని చెప్పారు. కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యల ఉద్దేశం ఏమిటో పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. కౌశిక్‌రెడ్డి ఏమీ అనలేదని బీజేపీ సభ్యులు కూడా ఎథిక్స్ కమిటీ సమావేశంలో చెప్పారని పేరొన్నారు. అయినా కాంగ్రెస్ సభ్యుల అభిప్రాయాలనే ప్రాతిపదికగా అంశాన్ని ఎథిక్స్ కమిటీ ఎజెండాలో చేర్చడం ఏకపక్ష నిర్ణయంగా కనిపిస్తున్నదని చెప్పారు.

# సంపాదకీయం

# మంచుకొండల్లో మహా విలయం

నేపాల్‌లో సంభవించిన భారీ వరదలు తీవ్ర విధ్వంసాన్ని సృష్టించాయి. భారీ ప్రాణ, ఆస్తి నష్టాన్ని మిగిల్చాయి. భోటే కోషి, త్రిశూలి నదుల వెంట ఉన్న గ్రామాలు, పట్టణాలు వరద ప్రవాహానికి తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇళ్లు, రహదారులు, వంతెనలు, విద్యుత్ ప్రాజెక్టులు వరద నీటిలో కొట్టుకుపోయాయి. ప్రకృతి విలయానికి ఇది సజీవ సాక్ష్యంగా నిలిచింది. గతంలో భారత్‌లో జరిగిన హిమానీ నదాలు ఉప్పొంగి న దానికి మించి అన్నట్లుగా ఈ విలయం ఉంది. ఊళ్లకు ఊళ్లే ధ్వంసం అయ్యాయి. కొండ ప్రాంతాలను కబళించి..కట్టడాలతో ప్రకృతిని దెబ్బతీసారు. దీంతో విలయం తీవ్రంగా ఉంది. ఊళ్లకు ఊళ్లు కొట్టుకు పోవడంతో ప్రజలు నీటి ప్రవాహంలో కొట్టుకు పోయారు. పర్యాటకులు కూడా కొట్టుకు పోయారు. ఎంతమంది ఎక్కడెక్కడ పోయారో లెక్కకట్టడం ఇప్పట్లో అయ్యే పనికాదు. ఇది మనకు హెచ్చరికలాంటిది. ప్రకృతి విలయాలకు పరిష్కారం కనుగొనడం లేదు. రెస్క్యూ ఆపరేషన్‌లో భాగంగా తీసిన ఏరియల్ వీడియోల్లో వరద విధ్వంసం భయానకంగా కనిపిస్తోంది. ఇళ్లు, మార్కెట్లతో కళకళలాడిన ప్రాంతాలు వరద తర్వాత బురద, శిథిలాలతో నిండిపోయాయి. కొన్ని చోట్ల గ్రామాలు ఉన్న ఆనవాళ్లు కూడా కనిపించని పరిస్థితి నెలకొంది. వరద ఉధృతికి అనేక ప్రాంతాల్లో ఇళ్ల కింది అంతస్తులు పూర్తిగా బురదలో కూరుకు పోయాయి. రహదారులు, వంతెనలు కొట్టుకు పోవడంతో సహాయక బృందాలు ప్రభావిత ప్రాంతాలకు చేరుకోవడం కూడా కష్టంగా మారింది. హిమాలయ దేశం నేపాల్‌లో సంభవించిన మెరుపు వరదలు వందల కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపాయి. భోటే కోషి నది ఉప్పొంగడంతో అనేక జిల్లాలను వరద, బురద కలిసి ముంచెత్తింది. ఈ జలప్రళయానికి మంచుకొండల్లో భూకంపమే కారణమని తొలుత వార్తలు వచ్చాయి. అయితే, హిమనీ సరస్సు బద్దలవడం వల్లే ఈ విపత్తు సంభవించినట్లు తాజాగా అమెరికా జియాలాజికల్ సర్వే తాజాగా వెల్లడించింది. అంతర్జాతీయ రెడ్‌క్రాస్ ప్రతినిధి డేవిడ్ ఫిషర్ మాట్లాడుతూ.. మొత్తం గ్రామాలు, మార్కెట్ ప్రాంతాలు తుడిచిపెట్టుకుపోయాయని తెలిపారు. బుధవారం ఉదయం 8.37 గంటల సమయంలో టిబెట్‌లోని గోసాయిన్‌కుండ ప్రాంతంలో 4.4 తీవ్రతతో భూకంపం సంభవించినట్లు తొలుత అమెరికా అధ్యయన సంస్థ అంచనా వేసింది. దాని ప్రభావంతో టిబెట్, నేపాల్ (సరిహద్దులోని పర్వత సమూహం నుంచి భారీ కొండ చరియ విరిగిపడినట్లు పేర్కొంది. అయితే, తాజాగా దీనిపై వివరణ ఇచ్చింది. కొండచరియలు విరిగిపడటం వల్లే ప్రకంపనలు సంభవించినట్లు తేలింది. హిమనీ సరస్సు బద్దలై భారీ మంచు చరియలు, రాళ్లు పడ్డాయి. దీంతో లిండే నది ఉప్పొంగి.. బోటే కోషి నదిలోకి వరద ఒక్కసారిగా దూసుకొచ్చిందని అమెరికా జియాలాజికల్ సర్వే స్పష్టం చేసింది. పర్వత ప్రాంతాల నుంచి భారీ పరిమాణంలో ఉన్న మంచు, రాళ్ల చరియలు విరిగిపడుతున్నట్లు శాటిలైట్ దృశ్యాల ద్వారా తెలిసిందని నిపుణులు పేర్కొన్నారు. మరోవైపు, ఈ వరదలను జర్మన్ రీసర్చ్ సెంటర్ ఫర్ జియోసైన్సెస్ విశ్లేషించింది. జలప్రళయానికి దాదాపు 7 నిమిషాల ముందు 4.4 తీవ్రతతో ప్రకంపనలు సంభవించినట్లు తాము గుర్తించామని తెలిపింది. ఆ వెంటనే భీకర వరద నేపాల్ జిల్లాలను ముంచెత్తినట్లు పేర్కొంది. ఈ విపత్తులో ఇప్పటివరకు 157 మంది ప్రాణాలు కోల్పోయారు. వందల మంది గల్లంతయ్యారు. వీరిలో అత్యధికులు విదేశీయులే. భారత్ నుంచి 140 మందికి పైగా వరదల్లో కొట్టుకుపోయినట్లు తెలుస్తోంది. అటు టిబెట్ వైపు కూడా వరద తీవ్రత ఎక్కువగానే ఉంది. ఆ దేశంలో ముగ్గురు మరణించగా.. 553 మందికి పైగా గల్లంత య్యారు. హిమాలయ దేశం నేపాల్‌లో జలప్రళయం వెనుక సమాచార లోపం కూడా ఓ బలమైన కారణంగా కన్పిస్తోంది. మంచు చరియలు విరగడంతో టిబెట్ వైపు వరద సంభవించినట్లు చైనాకు ముందే తెలిసినా తమను హెచ్చరించలేదని నేపాల్ గగ్గోలు పెడుతోంది. ఇరు దేశాల మధ్య ఈ సమాచారమార్పిడికి అధికారిక ఒప్పందం లేకపోవడంతో నేపాల్‌ను బీజింగ్ ముందస్తుగా అప్రమత్తం చేయలేదనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే, చైనా విషయంలో ఇప్పుడు భారత్‌ను కూడా ఇలాంటి సమస్యే వేధిస్తోంది. బ్రహ్మపుత్ర నదిపై చైనా నిర్మిస్తోన్న భారీ డ్యామ్‌తో మన ఈశాన్య రాష్ట్రాలకు కూడా నేపాల్ లాంటి ముప్పు పొంచి ఉందని మరోసారి నిపుణులు హెచ్చరిస్తున్నారు. నేపాల్ కాలమానం ప్రకారం ఉదయం 8.15 గంటలకు టిబెట్‌లోని కెరుంగీ కౌంటీలో మెరుపు వరదలు సంభవించాయి. ఈ ఘటన జరిగిన దాదాపు 45 నిమిషాల తర్వాత నేపాల్‌కు వరదల విషయం తెలిసిందే. అంత సమయం ఉన్నా కూడా చైనా అధికారులు నేపాల్‌ను అప్రమత్తం చేయలేదట. కెరుంగీ నుంచి భారీగా వరదల నేపాల్ దిశగా పోటెత్తినట్లు కొంతమంది స్థానికుల నుంచి చివరకు విపత్తు నిర్వహణ అధికారులకు సమాచారం వచ్చింది. దీంతో వీరు హుటాహుటిన చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతుండగా.. అప్పటికే వరద నేపాల్ జిల్లాలను ముంచెత్తింది. మధ్యాహ్నం ఒంటిగంటకు చైనా నుంచి నేపాల్‌కు సమాచారం అందింది. టిబెట్ వైపు నదిలో కొండచరియలు విరిగి పడటంతో.. భోటేకోషీ, త్రిశూలి నదులకు ముప్పు ఏర్పడిందనేది దాని సారాంశం. టిబెట్‌లో వరదల గురించి బీజింగ్ ముందుగానే తెలుసుకున్నా.. ఆ విషయాన్ని చేరవేయకపోవడంతో పెను నష్టం వాటిల్లినట్లు నేపాల్ ఆరోపిస్తోంది. అయితే, ఈ విపత్తును చైనాను బాధ్యులను చేయలేమని, ఇరు దేశాల మధ్య ఆ ఒప్పందం లేదని నిపుణులు పేర్కొంటున్నారు.

## భార్యపై భర్త ఆధిపత్యం చెలాయించడం కుదరదు

- పెళ్లి చేసుకున్నంత మాత్రాన భార్య బానిస కాదు
- పెళ్లంటే పరస్పర గౌరవంతో బతికే బంధం
- పనిమానిషిగా చూడాలనుకునే తీరు క్షమార్హం కాదు
- కర్నాటక హైకోర్టు సంచలన వ్యాఖ్యలు

బెంగళూరు,ఆగస్ట్28 : వివాహ బంధంలో భార్యపై భర్త ఆధిపత్యం చెలాయించకూడదని కర్ణాటక హైకోర్టు స్పష్టం చేసింది. పెళ్లి చేసుకున్నంత మాత్రాన భార్య ఇంటి పనులు చేయాలి, అత్తమామలను తప్పనిసరిగా చూసుకోవాలి, పుట్టింటికి వెళ్లాలంటే భర్త అనుమతి తీసుకోవాలనే నిబంధన ఏదీ లేదని పేర్కొంది. వివాహం అంటే పరస్పర గౌరవం, నమ్మకం, సమానత్వంతో కొనసాగాల్సిన బంధమని కోర్టు వ్యాఖ్యానించింది. జస్టిస్ చిల్లకూరు సుమలత ధర్మాసనం ఈ అంశంపై కీలక వ్యాఖ్యలు చేసింది. మహిళల వ్యక్తిగత స్వేచ్ఛ, ఆత్మగౌరవాన్ని కాపాడాల్సిన అవసరాన్ని కోర్టు తన తీర్పులో ప్రస్తావించింది. బెంగళూరు రూరల్ జిల్లాకు చెందిన సతీష్ అనే వ్యక్తి తన భార్య, కుమార్తెకు కుటుంబ న్యాయస్థానం నెలకు రూ.9,000 చొప్పున భరణం చెల్లించాలని ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించాడు. తన భార్య ఇంటి పనులు చేయడం లేదని, తన తల్లిదండ్రులను పట్టించుకోవడం లేదని, తన అనుమతి తీసుకోకుండానే తరచూ పుట్టింటికి వెళ్తోందని అతడు పిటిషన్‌లో పేర్కొన్నాడు. ఈ వాదనలపై కోర్టు తీవ్రంగా స్పందించింది. భర్త చేసిన ఆరోపణలను పరిశీలిస్తే భార్యను కుటుంబ సభ్యురాలిగా కాకుండా ఇంటి పనుల కోసం ఉంచుకున్న వ్యక్తిగా భావిస్తున్నట్లు కనిపిస్తోందని వ్యాఖ్యానించింది. భార్య తన తల్లిదండ్రులను కలవడానికి పుట్టింటికి వెళ్లాలంటే భర్త లేదా అత్తమామల అనుమతి తీసుకోవాలనే ఆలోచనను కోర్టు ప్రశ్నించింది. ఒక మహిళ తన తల్లిదండ్రులను కలవడానికి ఎవరి అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. భార్య ఎక్కడికి వెళ్లాలి, ఎవరిని కలవాలి అనే విషయాలను పూర్తిగా భర్త నియంత్రించడం సరైన పద్ధతి కాదని కోర్టు పేర్కొంది. ఇలాంటి ఆంక్షలు మహిళ వ్యక్తిగత స్వేచ్ఛను దెబ్బతీసే అవకాశం ఉందని అభిప్రాయపడింది. ఇంటి పనులన్నీ భార్యే చేయాలనే భావన సరికాదని హైకోర్టు స్పష్టం చేసింది. కుటుంబ జీవితంలో భార్యాభర్తలు ఇద్దరూ బాధ్యతలను పరస్పరం పంచుకోవాలని పేర్కొంది. అలాగే వృద్ధ తల్లిదండ్రులను చూసుకోవాల్సిన బాధ్యత ప్రధానంగా వారి సొంత పిల్లలపై ఉంటుందని కోర్టు తెలిపింది. అత్తమామలను చూసుకోవడాన్ని కోడలిపై తప్పనిసరి బాధ్యతగా మోపడం సమంజసం కాదని స్పష్టం చేసింది.కోడలు అత్తమామలకు సేవ చేయడం ఆమె ఇష్టంతో జరగాలి తప్ప, బలవంతం చేయడం సరికాదని పేర్కొంది. వివాహ బంధం కేవలం కొన్ని ఆచారాలు, సంప్రదాయాలతో ఏర్పడే సంబంధం కాదని కోర్టు పేర్కొంది. భార్యాభర్తల మధ్య ప్రేమ, నమ్మకం, పరస్పర గౌరవం, సహకారంఉండాలని తెలిపింది. లింగం ఆధారంగా మహిళల స్వేచ్ఛను పరిమితం చేయడం రాజ్యాంగం అందించే సమానత్వ సూత్రాలకు విరుద్ధమని కోర్టు అభిప్రాయపడింది. భార్య, కుమార్తెకు రోజుకురూ.150చొప్పున కూడా భరణం చెల్లించలేనని భర్త చేసిన అభ్యర్థనను కోర్టు కొట్టివేసింది.

## సాగు, తాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వ నిర్లక్ష్యం

**యాదాద్రికి గోదావరి జలాల వాటా కేటాయించాలి**

**పెండింగ్‌లో ఉన్న నీటి ప్రాజెక్టుల పూర్తికి నిధులివ్వాలి**

**సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో భువనగిరిలో పాదయాత్ర ప్రారంభం**

**జిల్లా కార్యదర్శి జహంగీర్ నేతృత్వంలో కదిలిన కామ్రేడ్స్**

**31న హైదరాబాద్‌లో మహాధర్నా..**

**సమస్యలు పరిష్కరించకుంటే పెద్దఎత్తున ప్రజా ఉద్యమం**

**సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఎస్. వీరయ్య**



హైదరాబాద్, ఆగస్టు 29: సాగు, తాగునీటి ప్రాజెక్టుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోందని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఎస్. వీరయ్య విమర్శించారు. ఫ్యూచర్ సిటీపై చూపుతున్న శ్రద్ధలో కొంతైనా.. ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న సాగు, తాగునీటి ప్రాజెక్టులపై చూపాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెండింగ్ సాగు, తాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన మూడు రోజుల మహా పాదయాత్ర శనివారం భువనగిరి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి ప్రారంభమైంది. చివరిరోజు 31న హైదరాబాద్‌లో మహాధర్నా జరుగుతుంది. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి జహంగీర్ నేతృత్వంలో ప్రారంభమైన పాదయాత్రకు కార్యకర్తలు భారీస్థాయిలో హాజరయ్యారు. వీరయ్య జెండా ఊపి మహా పాదయాత్రను ప్రారంభించారు. పాదయాత్రకు ముందు శాసనమండలి మాజీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి జహంగీర్, తదితర నాయకులతో కలిసి డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏర్పాటు చేసిన ప్రారంభ సభలో వీరయ్య మాట్లాడారు.మానవ నాగరికత చరిత్రలో సాగు, తాగునీటికి కీలక స్థానం ఉందన్నారు. వ్యవసాయ రంగం బలోపేతమైతే రైతుల ఆదాయం, ప్రజల కొనుగోలు శక్తి పెరిగి చిన్న వ్యాపారాలు, చేతివృత్తులు, పరిశ్రమలు, సేవా రంగం అభివృద్ధి చెందుతాయని తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో 7.5 లక్షల ఎకరాలకు పైగా సాగుభూమి ఉన్నప్పటికీ ఏ ఒక్క ఏడాది కూడా మొత్తం భూమికి సాగునీరు అందలేదన్నారు. 4 నుంచి 4.5 లక్షల ఎకరాలకు నీరందితే గొప్పగా భావించే పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం కరువు పరిస్థితుల నేపథ్యంలో కనీసం ఒకటి, రెండు లక్షల ఎకరాలకు నీరందుతుందో లేదో అనుమానంగా ఉందని అన్నారు.. ఏడు జిల్లాలతో ముడిపడి ఉన్న మూసీ నది ప్రక్షాళనకు గోదావరి జలాలను మళ్లించాలని డిమాండ్ చేశారు. అదే సమయంలో యాదాద్రి భువనగిరి జిల్లాకు గోదావరి జలాల వాటాను కేటాయించాలని కోరారు. ప్రభుత్వం హైదరాబాద్ సరిహద్దులు దాటి రాష్ట్ర అవసరాలపై దృష్టి పెట్టాలని సూచించారు. హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నాలో పాల్గొని ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేస్తామని చెప్పారు. రాబోయే శాసనసభ సమావేశాల్లో సాగు, తాగునీటి ప్రాజెక్టులపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమిస్తామన్నారు

## నేపాల్ విలయంతో భారత్‌కు హెచ్చరిక

- చైనా నిర్మిస్తున్న డ్యామ్‌తో భారత్‌కు ముప్పే
- బ్రహ్మపుత్రపై చైనా డ్యామ్ ప్రకృతి విలయానికి నాంది
- ఆందోళన వ్యక్తం చేస్తున్న నిపుణులు



న్యూఢిల్లీ,ఆగస్ట్27 : నేపాల్ విలయం తరవాత ఇప్పుడు భారత్‌కూ ఇలాంటి ముప్పే పొంచి ఉందన్న హెచ్చరికలు వస్తున్నాయి. అయితే అది చైనా వల్లనే అని తెలుస్తోంది. బ్రహ్మపుత్రపై చైనా నిర్మిస్తున్న భారీ డ్యామే. బీజింగ్‌తో మనకు నదీజల వివాద పరిష్కార ఒప్పందాలు, యంత్రాంగం లేవు. బ్రహ్మపుత్రలో ప్రవాహ హెచ్చుతగ్గులు, వర్షపాతం వంటి సమాచారం ఇచ్చిపుచ్చుకోవడానికైతే ఒక అవగాహనా ఒప్పందం ఉంది. దాన్ని అయిదేళ్లకు ఒకసారి పునరుద్ధరించవచ్చు. ఒకవేళ డ్యామ్ నిర్మాణం తర్వాత చైనా దాన్ని పునరుద్ధరించకపోతే.. భారత్‌కు పెను సమస్యగా మారుతుంది. దీనికి తోడు ఈ నిర్మాణం చేపట్టే ప్రాంతంలో ప్రకృతి విపత్తులకూ ఆస్కారం ఎక్కువే. అందువల్ల భవిష్యత్తులో ఈ నదిలో టిబెట్ వైపు ఏదైనా విపత్తు సంభవిస్తే.. చైనా దాన్ని భారత్‌కు చేరవేయకపోతే ఈశాన్య రాష్ట్రాలు వరదల్లో మునిగే ప్రమాదం ఉంది. బ్రహ్మపుత్ర నదిని టిబెట్‌లో యార్లంగ్ జాంగ్బో అంటారు. ఈ నదిపైనే చైనా ఏకంగా 167 బిలియన్ డాలర్ల అంచనా వ్యయంతో భారీ జలవిద్యుత్తు ప్రాజెక్ట్ నిర్మిస్తోంది. ఇందుకోసం డ్యామ్ నిర్మాణం చేపడుతోంది. చైనా గతంలో నిర్మించిన ప్రపంచంలో అతిపెద్దదైన త్రీగోర్జెస్ డ్యామ్ కన్నా ఇది మూడురెట్లు భారీది. బ్రహ్మపుత్ర నది 'గ్రేట్ బెండ్'గా పిలిచే భారీ వంపు ప్రాంతంలో నీరు రెండువేల మీటర్ల దిగువకు ప్రవహిస్తుంది. స్వల్పదూరంలో పైనుంచి పడటంవల్ల అక్కడ జల విద్యుత్తు ఉత్పత్తి ఎక్కువగా చేయొచ్చు. ఏటా 60వేల మెగావాట్ల విద్యుత్‌ను ఇది ఉత్పత్తి చేయగలదని చైనా చెబుతోంది. అయితే, ఈ నిర్మాణ ప్రాంతమే ఇప్పుడు భారత్‌కు సమస్యగా మారింది. ఈ ప్రాజెక్ట్‌పై ఆ మధ్య చైనా జియలాజికల్ సర్వే పర్యవేక్షణలో ఓ అధ్యయనం జరిగింది. ప్రాజెక్టు నిర్మాణం జరుగుతున్న ప్రాంతం అడుగు భాగంలోనే 'పైజెన్ ఫాల్ట్' (పగులు) ఉందని, ఇది అక్కడున్న రాళ్లను చీల్చుతున్నట్లుగా అందులో గుర్తించారు. ఈ బీటలు జల విద్యుత్ ప్రాజెక్టు సమీపంలో నిర్మించే డ్యామ్‌లు, రోడ్లు, వంతెనలు, సొరంగాల వంటి మౌలిక సదుపాయాలను గణనీయంగా దెబ్బతీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అందువల్ల భూకంపాలు సంభవిస్తే ఇక్కడ పరిస్థితిని అంచనా వేయడం కూడా కష్టమేనని నిపుణులు పేర్కొంటున్నారు. బ్రహ్మపుత్ర నదిపై భారత్‌లో కోట్లాది మంది ప్రజల జీవనం ఆధారపడి ఉంది. అస్సాం, అరుణాచల్ రాష్ట్రాల ప్రజలకు ఈ నదే ప్రాణాధారం. మామూలుగానే ఏటా బ్రహ్మపుత్రలో వరదల కారణంగా ఈశాన్య రాష్ట్రాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పుడు చైనా ఈ డ్యామ్‌ను నిర్మించిన తర్వాత.. ఇరు దేశాల మధ్య ఘర్షణలు తలెత్తి మెగా డ్యామ్ నుంచి ఒక్క పెట్టున అపార జలరాశిని విడుదలచేస్తే అది మన ఈశాన్య రాష్ట్రాల్లో విలయం సృష్టించే ప్రమాదం ఉంది. మరోవైపు, డ్యామ్ నిర్మాణం వల్ల బ్రహ్మపుత్రలో ప్రవాహం తగ్గిపోయినా పర్యవసానాలు తీవ్రంగానే ఉంటాయి. చైనా దిగువకు నీటికి విడుదల చేయకపోయినా.. నదిలో నీటి లభ్యత తగ్గితే సాగునీటికీ, తాగునీటికీ ఇబ్బంది పడాల్సి వస్తుంది. అందుకే బీజింగ్ మెగా డ్యామ్ సమస్యను ఎదుర్కొనేందుకు భారత్ కూడా 11వేల మెగావాట్ల సియాంగ్ అప్పర్ మల్టీపర్పస్ ప్రాజెక్ట్ నిర్మాణానికి సిద్ధమైంది. అరుణాచల్‌ప్రదేశ్‌లోని సియాంగ్ నదిలో నిర్మించతలపెట్టిన ఈ డ్యామ్.. ఎగువ నుంచి వచ్చే నీటి ప్రవాహాన్ని నియంత్రించేందుకు సాయపడుతుంది. కొందరు భూగర్భ శాస్త్రవేత్తలు దీన్ని డ్యామ్ అని కాకుండా 'వాటర్ బాంబ్' అని పిలుస్తున్నారు. చైనా ఆధీనంలోని టిబెట్ అటానమస్ రీజియన్‌లోని ఈ ఆనకట్ట నిర్మాణం జరుగుతోంది. అయితే ఈ రీజియన్ ప్రాంతంలో తరచూ భూకంపాలు సంభవిస్తాయి. ఒకవేళ డ్యామ్ నిర్మించాక భూకంపం ఏర్పడితే భారత్, బంగ్లాదేశ్‌లపై తీవ్ర ప్రభావం పడుతుంది. భూకంపాల కారణంగా భారీ వరదలు ఏర్పడతాయి. అందుకే మైడాగ్ డ్యామ్ భారత్‌కు వాటర్ బాంబ్‌లాగా మారనుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. మైడాగ్ డ్యామ్ విషయంలో భారతీయులు మాత్రమే ఆందోళన చెందడం లేదు. చైనా భూగర్భ శాస్త్రవేత్తలూ ఈ ఆనకట్టపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీని నిర్మాణం పూర్తయితే బ్రహ్మపుత్ర జలాలు చైనా ఆధీనంలోకి వెళ్లిపోతాయి. చైనా జలాలను ఎక్కువ కాలం నిల్వ ఉంచి ఒకేసారి విడుదల చేస్తే ఈశాన్య రాష్ట్రాల్లో భారీ వరదలు ఏర్పడతాయి. మరోవైపు సమ్మర్ లాంటి సీజన్లలో చైనా అసలు జలాలనే విడుదల చేయకపోతే నీటి ఎద్దడి నెలకొంటుంది. అయితే ఈ ముప్పు నుంచి తప్పించుకోవడానికి భారత్ కూడా ఓ మెగా ప్రాజెక్టును నిర్మించ తలపెట్టిందని సమాచారం.

## నేపాల్ వరదల్లో 300 మంది భారతీయుల గల్లంతు

- విషాదంలో 175కు పెరిగిన మృతుల సంఖ్య
- సహాయక చర్యలకు అనుమతి కోరిన జగ్గీవాసుదేవ్



ఖాట్మండ్,ఆగస్ట్27 : నేపాల్ ప్రకృతి విలయంలో గల్లంతైనవారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఈ జలప్రళయంలో 300 మంది వరకు భారతీయులు కొట్టుకుపోయినట్లు నేపాల్ విదేశాంగ శాఖ మంత్రి శిశిర్ ఖనాల్ గురువారం వెల్లడించారు. ఈ విషాదంలో మృతుల సంఖ్య 175కు పెరిగింది.నేపాల్ లోని విపత్తు నిర్వహణ సంస్థ ప్రకటన ప్రకారం.. ఈ ఆకస్మిక వరదల కారణంగా 826 మంది ఆచూకీ గల్లంతయ్యింది. వారిలో 85 మంది భద్రతా సిబ్బంది కాగా.. 162 మంది వివిధ హైడ్రోపవర్ కేంద్రాల్లో పనిచేస్తోన్న ఉద్యోగులు ఉన్నారు. 579 పర్యాటకులు ఉన్నారని ఆ సంస్థ పేర్కొంది. వేలమంది నిరాశ్రయులయ్యారు. ఈ భారీ విపత్తు తీవ్రతను అంచనా వేస్తున్నాం అని ఖనాల్ పేర్కొన్నారు. అటు టిబెట్ వైపు 588 మంది గల్లంతయ్యారు. వారిలో 260 మంది విదేశీయులే. హిమాలయాల్లో కరిగిన మంచు జలవనరుల్లో నీటి మట్టాలను పెంచుతుందని, ఇప్పుడు మనందరం చూసింది అదేనని నేపాల్ మంత్రి అన్నారు. ఈ వరద మరింత దిగువకు ప్రవహించి ఉంటే.. భారత రాష్ట్రాలపైనా ప్రభావం పడేదని తెలిపారు. గతంలోనూ ఇలా జరిగిన సందర్భాలున్నాయని గుర్తుచేశారు. భారత్, చైనా, నేపాల్, భూటాన్ పర్యావరణపరంగా అనుసంధానమై ఉన్నాయని, ఈ దేశాలు తమ విభేదాలను పక్కనపెట్టి కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. మంచు చరియలు విరగడంతో టిబెట్ వైపు సంభవించిన వరద గురించి చైనాకు ముందే తెలిసినా నేపాల్‌ను అప్రమత్తం చేయలేదని తీవ్ర ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో మంత్రి స్పందన వచ్చింది. ఈ వరదల్లో ఈశా ఫౌండేషన్‌కు చెందిన దాదాపు 80 మంది గల్లంతైన సంగతి తెలిసిందే. దీనిపై సద్గురు జగ్గీ వాసుదేవ్ స్పందించారు. సహాయక చర్యల్లో సహకరించేందుకు తనతోపాటు మరికొంతమంది వాలంటీర్లను అనుమతించాలని చైనా అధికారులను కోరారు. ప్రకృతి విపత్తుతో అల్లకల్లోమైన హిమాలయ దేశానికి భారత్ ఆపన్న హస్తం అందించింది. రెండు విమానాల్లో 47.5 టన్నుల సహాయక సామగ్రితో పాటు రెస్క్యూ బృందాలను ఖాఠ్మండూకు పంపింది.

## నేపాల్ వరదల్లో మాజీ ఎమ్మెల్యే భార్య గల్లంతు



కోల్‌కతా,ఆగస్ట్27 : తృణమూల్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే శుభ్రాన్షు రాయ్ భార్య శర్మిష్ట భౌమిక్ రాయ్ నేపాల్ వరదల్లో గల్లంతయ్యారు. శర్మిష్ట కోల్‌కతాకు చెందిన ఓ ట్రావెల్ ఏజెన్సీ ద్వారా కైలాస మానససరోవర యాత్ర కోసం ఆగస్టు 21వ తేదీన నేపాల్ వెళ్లారు. ఆమె ఆగస్టు 25వ తేదీ మంగళవారం రాత్రి 11:30 గంటల సమయంలో శుభ్రాన్షు రాయ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. తాను టిబెట్ సరిహద్దుకు సమీపంలోని 'కైరోంగ్' ప్రాంతంలో ఉన్నట్లు భర్తతో చెప్పారు. బుధవారం ఉదయం నేపాల్-టిబెట్ సరిహద్దుల్లో భారీ ఎత్తున మెరుపు వరదలు వచ్చాయి. అప్పటినుంచి శర్మిష్టతో కమ్యూనికేషన్ పూర్తిగా తెగిపోయింది. తన భార్య పేరు మిస్సింగ్ లిస్ట్‌లో ఉందని శుభ్రాన్షు రాయ్ ధ్రువీకరించారు. కేవలం శర్మిష్ఠ మాత్రమే కాకుండా, ఆమెతో పాటు యాత్రకు వెళ్లిన కోల్‌కతాకు చెందిన 32 మంది యాత్రికుల బృందం ఆచూకీ లేకుండా పోయింది. వారి ఆచూకీ కోసం కుటుంబసభ్యులు భారత రాయబార కార్యాలయాన్ని, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని ఆశ్రయించారు.

## వీసా ఇంటర్వ్యూల నిలిపివేత

- భారతీయ విద్యార్థులు, ఉద్యోగార్థులకు ఇక్కట్లు




వాషింగ్టన్,ఆగస్ట్28 : అమెరికాలో చదువుకోవాలని, ఉద్యోగం చేయాలని లేదా అక్కడే కెరీర్ కొనసాగించాలని భావిస్తున్న భారతీయులకు మరోసారి అనిశ్చితి ఎదురైంది. ప్రపంచ వ్యాప్తంగా వీసా అపాయింట్‌మెంట్లను నిలిపివేసి రీషెడ్యూల్ చేయనున్నట్టు అమెరికా తాజాగా ప్రకటించింది. అమెరికా కాన్సులర్ అధికారులకు కొత్త శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ మార్పులు చోటుచేసు కున్నాయి .వీసా దరఖాస్తుదారులను మరింత క్షుణ్ణంగా పరిశీలించడం, ముఖ్యంగా వారు అమెరికా ప్రభుత్వ ప్రజా సంక్షేమ ప్రయోజనాలపై ఆధారపడే అవకాశం ఉందా అనే అంశాన్ని అంచనా వేయడంపై అధికారులకు శిక్షణ ఇస్తున్నట్టు నివేదికలు చెబుతున్నాయి. ఈ శిక్షణ కోసం కొన్ని వీసా అపాయింట్ మెంట్లను మార్చుతున్నారు. ఇప్పటికే ఇంటర్వ్యూ తేదీలు పొందిన కొంతమంది దరఖాస్తుదారులకు కూడా అపాయింట్‌మెంట్లు రద్దు చేసి, కొత్త తేదీని తర్వాత తెలియజేస్తామని సమాచారం అందించారు ఇటీవలి కాలంలో అమెరికాలో హెచ్-1బీ ఆమోదాల్లో భారతీయుల వాటా 70 శాతానికి పైగా ఉంది. ప్రస్తుతం అమెరికా యూనివర్సిటీలలో 3,30,000 మందికి పైగా భారతీయ విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. అందువల్ల వీసా ఇంటర్వ్యూ తేదీలో ఆలస్యం విద్యార్థుల యూనివర్సిటీ జాయినింగ్ తేదీలను, ఉద్యోగుల జాబ్ ఆఫర్లు, రీలొకేషన్ ప్లాన్లను ప్రభావితం చేసే అవకాశం ఉంది. అయితే ఎఫ్-1 స్టూడెంట్ వీసాలు లేదా హెచ్-1బీ వర్క్ వీసాల జారీని పూర్తిగా నిలిపివేయలేదు. అపాయింట్‌మెంట్ షెడ్యూలింగ్‌లో అంతరాయం మాత్రమే ఏర్పడుతోంది. అమెరికా ఇప్పటికీ భారతీయ విద్యార్థులు, టెక్నాలజీ నిపుణులకు ముఖ్యమైన గమ్యస్థానంగానే ఉంది. అయితే వీసా స్క్రీనింగ్, హెచ్-1బీ ఖర్చులు, ఎంపిక విధానం, ఎఫ్-1 నిబంధనలు, అపాయింట్‌మెంట్ టైమ్‌లైన్లలో మార్పులు రావడంతో అమెరికా వెళ్లే ప్రణాళిక గతంలో కంటే మరింత జాగ్రత్తగా చేయాల్సిన అవసరం ఏర్పడింది.

# రాజన్న ఆశీస్సులతో తెలంగాణ సుభిక్షం కావాలి...



**-అర్హులైన ఒక్క ఓటు కూడా పోకూడదు**
**-ఓటు హక్కే ప్రజాస్వామ్యానికి అసలైన ఆయుధం**
**-రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల :**

తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, రాష్ట్రంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు . శనివారం వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవాలయంలోని భీమేశ్వరాలయంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ స్వామివారిని దర్శించుకొని,ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, తమ ఇష్టదైవమైన శ్రీ రాజరాజేశ్వర స్వామివారి ఆశీస్సులు తెలంగాణ ప్రజలందరిపై ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రజలంతా ఐక్యతతో, అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.కొత్తకొండ వీరభద్రస్వామివారి నక్షత్రమాల వేసుకున్న సందర్భంగా వేములవాడకు వచ్చినట్లు తెలిపారు. కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయానికి కాకతీయుల కాలం నాటి గొప్ప చరిత్ర ఉందని పేర్కొన్నారు. ఆధ్యాత్మికతతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వాన్ని ప్రతిబింబించే ఇటువంటి పుణ్యక్షేత్రాలను ప్రతి ఒక్కరూ దర్శించుకుని దైవ ఆశీస్సులు పొందాలని కోరారు.ఇటీవల కొండగట్టు పాదయాత్రతో పాటు పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా పలు దేవాలయాల్లో పూజలు నిర్వహించారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు శాశ్వత సుఖసంతోషాలతో, ఐక్యతతో, అభివృద్ధితో ముందుకు సాగాలన్నదే తమ ఆకాంక్ష అని అన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరి ఓటు కాపాడుకోవాలి

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం ఓటర్ల సవరణ కార్యక్రమం కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైన హక్కు అని, అర్హత ఉన్న ఒక్క ఓటు కూడా తొలగిపోకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు.పేర్లలో స్పెల్లింగ్ తప్పులు, ఇతర వివరాల్లో పొరపాట్లు ఉన్నా లేదా ఓటర్లకు నోటీసులు అందినా వాటిని నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత అధికారులను సంప్రదించాలని అన్నారు . అవసరమైన ధ్రువపత్రాలు సమర్పించి తమ ఓటు వివరాలను సరిచేసుకోవాలని సూచించారు.

కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కూడా బూత్ స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండి అర్హత ఉన్న ప్రతి ఒక్కరి ఓటు నమోదయ్యేలా కృషి చేయాలని,ఇప్పటికే ఉన్న ఓటర్ల వివరాల్లో తప్పులు ఉంటే వాటిని సరిచేసుకునేందుకు ప్రజలకు సహకరించాలని అన్నారు .

గతంలో కొన్ని రాష్ట్రాల్లో జరిగిన ఓటర్ల పునర్విమర్శ ప్రక్రియపై రాజకీయ పార్టీలు, ప్రజల నుంచి అనేక అనుమానాలు, ఆరోపణలు వ్యక్తమైనవి అని,తెలంగాణలో మాత్రం అర్హత ఉన్న ప్రతి పౌరుడి ఓటు హక్కు కాపాడబడేలా ఓటర్ల సవరణ ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరగాలని అన్నారు.

ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఓటర్ల సవరణ కార్యక్రమం ఎలాంటి పొరపాట్లకు, వివాదాలకు తావులేకుండా సజావుగా పూర్తికావాలని, అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరు కూడా తన ఓటు హక్కును కోల్పోకూడదని అన్నారు.తెలంగాణ ప్రజలందరికీ తన విజ్ఞప్తి ఒక్కటేనని, ప్రతి ఒక్కరూ తమ ఓటును తామే కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఓటర్ల సవరణలో తమ పేరు, ఇతర వివరాలు సరిగ్గా ఉన్నాయో లేదో తప్పకుండా పరిశీలించుకోవాలని సూచించారు.ఎన్నికల కమిషన్ వ్యవహారశైలిపై పలు వర్గాల నుంచి విమర్శలు వస్తున్నాయని, కొన్ని రాష్ట్రాల్లో ఓటర్ల సవరణ ప్రక్రియ అనంతరం జరిగిన ఎన్నికల ఫలితాలపై కూడా అనేక సందేహాలు వ్యక్తమయ్యాయని అన్నారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ప్రజాస్వామ్యంలో ప్రజల చేతిలో ఉన్న అత్యంత శక్తివంతమైన ఆయుధం ఓటు హక్కు అని, ఆ హక్కును ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా కాపాడుకోవాలని అన్నారు.



# యువత మైదానాల్లో ఉండాలి.. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి..

**-వేములవాడలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు..**
**-సెప్టెంబర్ 26 నుంచి 29 వరకు నిర్వహణ..**
**-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ,వేములవాడ:**

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు వేములవాడ పట్టణం వేదిక కానుందని,సెప్టెంబర్ 26, 27, 28, 29 తేదీల్లో నాలుగు రోజులపాటు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను ఘనంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు.శనివారం

వేములవాడ పట్టణంలో త్రినేత్ర ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి ఒక్కో జట్టుతో పాటు హైదరాబాద్‌కు చెందిన మరో జట్టు పోటీల్లో పాల్గొంటుందని,బాలుర విభాగంలో 34 జట్లు, బాలికల విభాగంలో 34 జట్లు కలిపి మొత్తం 68 జట్లు బరిలోకి దిగనున్నాయని, సుమారు 1,358 మంది క్రీడాకారులు, కోచ్‌లు, సహాయక సిబ్బంది ఈ క్రీడా పోటీల్లో పాల్గొంటారని అన్నారు.

ఇటీవలే వేములవాడలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలను విజయవంతంగా నిర్వహించామని, అదే స్ఫూర్తితో కబడ్డీ పోటీలను కూడా పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు . క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతి, భోజనం, రవాణా, క్రీడా మైదానాలు తదితర అంశాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యువత ఎక్కువ సమయం క్రీడా మైదానాల్లో గడపాలని ఆకాంక్షిస్తున్నారని,యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా క్రీడల వైపు మళ్లాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని, భవిష్యత్‌లో తెలంగాణకు చెందిన క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని అన్నారు .రానున్న రోజుల్లో తెలంగాణ యువత, క్రీడాకారులు ఒలింపిక్స్‌లో సత్తా చాటేలా సీఎం కప్ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు కూడా క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు, జాతీయ స్థాయికి సిద్ధం చేసేందుకు దోహదపడతాయని అన్నారు.

ఈ క్రీడా పోటీలకు రాష్ట్ర మంత్రులు శ్రీహరి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు తదితర ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు. పోటీల నిర్వహణ కోసం ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరి సలహాలు, సూచనలు తీసుకుంటూ ముందుకు సాగుతామని అన్నారు.రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# నీళ్లు లేవు.. ఎరువులు లేవు.. ఇదేనా రైతు రాజ్యం..?

**-యాప్‌ల పేరుతో అన్నదాతలకు కొత్త కష్టాలు..**
**-నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు ధ్వజం**

**బలగం టీవీ, గంభీరావుపేట :**

రాష్ట్రంలో రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని,సాగునీరు, ఎరువులు సకాలంలో అందించకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. గంభీరావుపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశనికి బీఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య తో కలసి నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు.ఈ సందర్బంగా నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో కొద్దిపాటి వర్షాలు కురవడంతో రైతులు సాగు చేపట్టినప్పటికీ.. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఇంకా కరువు పరిస్థితులు కొనసాగుతున్నాయని అన్నారు. పంటలు సాగు చేసిన రైతులకు అవసరమైన సమయంలో ఎరువులు అందించాల్సిన ప్రభుత్వం.. యాప్‌ల పేరుతో కొత్త ఆంక్షలు పెడుతోందని,ఒక ప్రాంతానికి చెందిన రైతు ఎరువు కోసం మరో ప్రాంతానికి వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.కాళేశ్వరం నీటిని సకాలంలో ఎత్తిపోసి చెరువులను నింపి ఉంటే తెలంగాణ మరింత సస్యశ్యామలం అయ్యేదని అన్నారు. రైతులకు సాగునీరు, ఎరువులు, ఇతర వ్యవసాయ సౌకర్యాలు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.ప్రజలకు ఇచ్చిన 100 రోజుల హామీలను ప్రభుత్వం ఇప్పటికీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ,రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించి సకాలంలో ఎరువులు, సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు వచ్చే నెల 2 నుంచి 7వ తేదీ వరకు రోజుకో ప్రజా సమస్యపై నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. రైతులు, మహిళలు, విద్యార్థులు, యువత తదితర వర్గాల సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామని అన్నారు.

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మాట్లాడుతూ

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని ప్రభుత్వం ఏర్పడి దాదాపు 1000 రోజులు పూర్తవుతున్నా అనేక హామీలు నెరవేరలేదని ఆరోపించారు.కేటీఆర్ పిలుపు మేరకు సెప్టెంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజా సమస్యలపై



నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు, మహిళలు, విద్యార్థులు, యువత తదితర వర్గాలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు.ఎన్నికల సమయంలో మహిళలకు నెలకు రూ.2,500, రైతులకు రూ.15 వేల రైతుభరోసా, తులం బంగారం, విద్యార్థులకు ఆర్థిక సాయం, రెండు లక్షల ఉద్యోగాలు వంటి హామీలు ఇచ్చారని, వాటిలో అనేకం ఇప్పటికీ అమలు కాలేదని అన్నారు. రైతు బీమా సహా పలు సంక్షేమ పథకాల విషయంలోనూ ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన కేసీఆర్ కిట్, అమ్మఒడి వంటి సంక్షేమ కార్యక్రమాలు ,మహిళలు, తల్లీబిడ్డల సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశాయని పేర్కొన్నారు.

అధికారంలో లేకపోయినా బీఆర్ఎస్ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతోందని అన్నారు. ప్రతి కార్యకర్త ప్రజల్లోకి వెళ్లి కాంగ్రెస్ ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ, వాటి అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. కేటీఆర్ నాయకత్వంలో సెప్టెంబర్ 1 నుంచి 7 వరకు చేపట్టనున్న నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.



## సెప్టెంబర్ 1 నుంచి బోయినిపల్లి మండల స్థాయి పాఠశాలల క్రీడా పోటీలు

**బలగం టీవీ, బోయినిపల్లి;**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల స్థాయి పాఠశాలల క్రీడా పోటీలు 2026 సెప్టెంబరు ఒకటో తేదీ నుండి మూడవ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి శ్రవణ్ కుమార్ తెలిపారు.సెప్టెంబర్ ఒకటవ తేదీ నాడు అండర్ 14 ఇయర్స్ మరియు అండర్ 17 ఇయర్స్ బాలబాలికల కబడ్డీ పోటీలు మరియు అండర్ 14,17 ఇయర్స్ బాలబాలికల అథ్లెటిక్స్ పోటీలు జడ్పిహెచ్ఎస్ నర్సింగాపూర్ పాఠశాల గ్రౌండ్ లో నిర్వహించబడును. సెప్టెంబర్ 2వ తేదీ నాడు అండర్ 14 ఇయర్స్ మరియు అండర్ 17 ఇయర్స్ బాలబాలికల వాలీబాల్ పోటీలు జడ్పిహెచ్ఎస్ కొదురుపాక పాఠశాల గ్రౌండ్ లో నిర్వహించబడును.సెప్టెంబర్ మూడవ తేదీ నాడు అండర్ 14 ఇయర్స్ మరియు అండర్ 17 ఇయర్స్ బాలబాలికల కోకో పోటీలు జడ్పీహెచ్ఎస్ విలాసాగర్ పాఠశాల గ్రౌండ్ లో నిర్వహించబడును. పై ఆటల పోటీలలో ఉదయం తొమ్మిది గంటలకు రిపోర్ట్ చేయవలెను. మరిన్ని వివరాలకు మండల ఎస్.జి.ఎఫ్ కన్వీనర్ నర్రా శ్రీనివాస్ రెడ్డి పిడిని సంప్రదించగలరు. ఈ కార్యక్రమంలో పిడి. ప్రభాకర్, పి.ఈ.టి లు మధుకర్ ప్రణయ్ తదితరులు పాల్గొంటారని మండల విద్యాధికారి శ్రవణ్ కుమార్ తెలిపారు.

# విద్యార్థుల భవిష్యత్‌తో ప్రభుత్వం చెలగాటమాడొద్దు



**-ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి..**
**-బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి**

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల :**

విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి డిమాండ్ చేశారు. విద్యార్థులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆరోపిస్తూ బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలో ఒకరోజు నిరాహార దీక్ష చేపట్టారు.ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ.. విద్యార్థులకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో విఫలమైందని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.

రీయింబర్స్‌మెంట్ అందకపోవడంతో అనేక ప్రైవేట్ కళాశాలలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాయని, చదువులు పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, టీసీలు, మెమోలు ఇవ్వలేని పరిస్థితులు ఏర్పడ్డాయని ఆరోపించారు. దీంతో ఒకవైపు ఉన్నత విద్యకు వెళ్లలేక, మరోవైపు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోలేక విద్యార్థులు నష్టపోతున్నారని అన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ద్వారా బడుగు, బలహీన వర్గాలకు చెందిన అనేక మంది విద్యార్థులు ఇంజినీరింగ్, మెడికల్ తదితర ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం పొందారని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద విద్యార్థులు విద్యకు దూరమయ్యే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు.ఎన్నికల సమయంలో విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి, రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు వంటి హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్నా వాటి అమలు ఆశించిన స్థాయిలో లేదని అన్నారు .

ప్రస్తుతం నీట్, ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ ప్రక్రియలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్‌పై వెంటనే స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కళాశాలలకు చెల్లించాల్సిన బకాయిలను విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్‌కు భరోసా కల్పించాలని కోరారు.విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్యార్థుల భవిష్యత్ సమస్యలను పరిష్కరించడంపై దృష్టి పెట్టాలని, ఇతర ప్రాధాన్యతల కంటే విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



## నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా రాజన్న సిరిసిల్లలో ఘనంగా క్రీడా పోటీలు..

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల :**

రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (సాట్స్) హైదరాబాద్ ఆదేశాల మేరకు, జిల్లా కలెక్టర్ అనుమతితో మేజర్ ధ్యాన్ చంద్ జన్మదినాన్ని పురస్కరించుకొని శనివారం "నేషనల్ స్పోర్ట్స్ డే 2026" సందర్భాన్ని పురస్కరించుకుని సిరిసిల్ల మినీ స్టేడియంలో జిల్లా స్థాయి క్రీడా పోటీలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మినీ స్టేడియంలో వాలీబాల్, కబడ్డీ మరియు ఆర్చరీ పోటీలను నిర్వహించారు. అనంతరం జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి ఎ. రాందాస్ అధ్యక్షతన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించగా,ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా విద్యాశాఖాధికారి మొండయ్య, జిల్లా అగ్రికల్చర్ ఆఫీసర్ అఫ్జల్ బేగం, నెహ్రూ యువ కేంద్ర కోఆర్డినేటర్ కిరణ్ కుమార్ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. నేషనల్ స్పోర్ట్స్ డే పోటీలలో గెలుపొందిన క్రీడాకారులతో పాటు, వివిధ క్రీడాంశాల్లో జాతీయ స్థాయిలో సత్తా చాటి విజేతలుగా నిలిచిన 20 మంది క్రీడాకారులకు ప్రథమ, ద్వితీయ బహుమతులు, గోల్డ్, సిల్వర్ మెడల్స్, మెమెంటోలు మరియు ప్రశంసా పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ నోడల్ ఆఫీసర్ డి. ప్రభాకర్, వాలీబాల్ అకాడమీ కోచ్‌లతో పాటు కబడ్డీ కోచ్‌లు, క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు, వివిధ యూత్ అసోసియేషన్ సభ్యులు, పాఠశాల మరియు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.





# వెయ్యి రోజులు పూర్తయినా.. హామీల అమలేది..?

**-సెప్టెంబర్ 2 నుంచి పోరుబాట**

**బలగం టీవీ, వేములవాడ :**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలు మాత్రం కనిపించడం లేదని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. వేములవాడ పట్టణంలో నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో చల్మెడ లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారంటీలు, వివిధ డిక్లరేషన్ల అమలుపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను వంద రోజుల్లో అమలు చేస్తామని ప్రకటించినప్పటికీ, వెయ్యి రోజుల పాలనలోనూ ప్రధాన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని అన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రైతులు, మహిళలు, విద్యార్థులు, యువత, వృద్ధులు తదితర వర్గాలకు ఇచ్చిన హామీలు, పెండింగ్ ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని సూచించారు.కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిపై ప్రజా ఉద్యమాలు చేపట్టాలని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతి, పాలనా లోపాలను ప్రజల ముందు ఎండగట్టాలని పార్టీ నాయకులకు సూచించారు.సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ హామీల వైఫల్యాలపై పోరుబాట నిర్వహించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో వినూత్న నిరసన కార్యక్రమాలు చేపట్టి ప్రజలను చైతన్యపరచనున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రజలకు మరోసారి గుర్తుచేస్తూ, వాటి అమలు పరిస్థితిని వివరించాలని, పార్టీ శ్రేణులు ఐక్యంగా పోరాడి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు.



## అక్రమంగా మట్టి తరలిస్తున్న లారీ పట్టివేత

బలగం టీవీ, బోయినిపల్లి



ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న లారీని బోయినిపల్లి పోలీసులు పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం ఉదయం బోయినిపల్లి మండలం వెంకట్రావుపల్లి గ్రామంలో ఎస్సై రమాకాంత్ తనిఖీలు నిర్వహించగా, బావుపేట గ్రామం నుంచి వెంకట్రావుపల్లి గ్రామానికి ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న అశోక్ లేలాండ్ లారీ టీఎస్-04-యుఏ-6058ను పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. లారీ డ్రైవర్ బోదాసు సమ్మయ్యను విచారించగా, లారీ యజమాని దండ్ల మల్లేష్ సూచనల మేరకు మట్టిని తరలిస్తున్నట్లు తెలిపినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం పట్టుకున్న లారీని బోయినిపల్లి తహసీల్దార్ , ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరుస్తామని ఎస్సై రమాకాంత్ తెలిపారు.



## ప్రజల్లో ఉన్నాం.. భరోసా ఇద్దాం

### -కాంగ్రెస్ 420 హామీల వైఫల్యంపై సెప్టెంబర్ 2 నుంచి నిరసనలు

### బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట,

ప్రభుత్వం మారినా గ్రామాల్లో ప్రజలకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలే అండగా నిలుస్తున్నారని, అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రజలకు భరోసా కల్పించాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పిలుపునిచ్చారు.

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని స్టార్ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సన్నాహక సమావేశంలో తోట ఆగయ్య మాట్లాడుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు సెప్టెంబర్ 2 నుంచి 7వ తేదీ వరకు చేపట్టనున్న నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో 420 హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన వెయ్యి రోజుల్లో వాటిని అమలు చేయడంలో విఫలమైందని అన్నారు . ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చేపట్టనున్న నిరసన కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సూచించారు.

బీఆర్ఎస్ నాయకుడు కొండూరి రవీందర్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పాలన తీరుపై ప్రజలు ఇప్పటికే ఒక అంచనాకు వచ్చారని అన్నారు. రాష్ట్రంలో ఏమీ లేదని చెప్పిన నాయకులు ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఏం చేశారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు అందినకాడికి దండుకునే పనిలో ఉన్నారనీ అన్నారు . భవిష్యత్తులో కాంగ్రెస్‌కు అధికారం దక్కదనే విషయం ఆ పార్టీ కార్యకర్తలకు కూడా అర్థమైందని అన్నారు.

బీఆర్ఎస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి తుల ఉమ మాట్లాడుతూ సిరిసిల్ల నియోజకవర్గ ప్రజలు చైతన్యవంతులని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వివిధ వర్గాలకు ఇచ్చిన హామీలు, వాటి అమలు తీరును ప్రజలకు వివరిస్తే ప్రభుత్వ వైఫల్యాలు వారికి మరింత స్పష్టమవుతాయని పేర్కొన్నారు. ప్రతి నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వర్స కృష్ణహరి, మాజీ జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, మాజీ ఎంపీపీ పిల్లి రేణుక, మాజీ సెస్ డైరెక్టర్ కుంబాల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ 1000 రోజుల వైఫల్యాలపై బీఆర్ఎస్ సమరభేరి

### సెప్టెంబర్ 2 నుంచి ఎనిమిది రోజుల పాటు నిరసనలు

### ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో ఉద్యమించాలి: మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

బలగం టీవీ, జగిత్యాల



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా ఆ పార్టీ వైఫల్యాలను ఎండగట్టేందుకు బీఆర్ఎస్ శ్రేణులు సమరానికి సిద్ధమవుతున్నాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు జగిత్యాల జిల్లా పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో ధర్మపురి నియోజకవర్గ ముఖ్య నాయకుల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రజల్లోకి వెళ్లి నిలదీయాలని కొప్పుల ఈశ్వర్ పిలుపునిచ్చారు. ఆరు గ్యారెంటీలు, రైతు రుణమాఫీ, మహిళలు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీల అమలు తీరును ప్రజలకు వివరించాలని సూచించారు. సెప్టెంబర్ 2 నుంచి ఎనిమిది రోజుల పాటు నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు.

ధర్మపురి నియోజకవర్గంలో నిలిచిపోయిన మౌలిక వసతులు, ఉపాధి సమస్యలపై క్షేత్రస్థాయిలో పోరాటాలు నిర్వహించాలని పార్టీ నేతలు, కార్యకర్తలకు సూచించారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా ప్రతి గ్రామంలో ప్రజలను చైతన్యపరిచి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని కోరారు.

ప్రతి గ్రామంలో ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం ప్రభుత్వాన్ని నిలదీయాలని కొప్పుల ఈశ్వర్ పిలుపునిచ్చారు. పార్టీ అధినేత కేసీఆర్ మార్గదర్శకంలో, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు నాయకత్వంలో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడతామని నాయకులు తెలిపారు.

సమావేశంలో ధర్మపురి నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

### తెలంగాణ ఉద్యమ నాయకుల సేవలు మరవలేనివి: ఒడితెల సతీష్‌కుమార్

### మృతుల చిత్రపటాలకు పూలమాలలేసి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే

బలగం టీవీ, చిగురుమామిడి

ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన బాధిత కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే ఒడితెల సతీష్‌కుమార్ హామీ ఇచ్చారు. శనివారం చిగురుమామిడి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన ఆయన, ఇటీవల మరణించిన పలువురి నివాసాలకు వెళ్ళి వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి అశ్రునివాళులర్పించారు.

పలు గ్రామాల్లో పరామర్శలు

రామంచలో నర్రా జగదీశ్వర్ రెడ్డి, ఇందుర్తిలో గౌరవేని లచ్చవ్వ, బల్ల రాములు, సీతారాంపూర్ లో ముసుకు వెంకట్ రెడ్డి, రేకొండలో పరుపాటి కనకవ్వ, చిగురుమామిడిలో కోనేటి వెంకవ్వ కుటుంబాలను పార్టీ నాయకులతో కలిసి ఆయన పరామర్శించారు. వారి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులకు గాఢ సానుభూతిని తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి

ఈ సందర్భంగా సతీష్ కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమం నుంచి రామంచ జగదీశ్వర్ రెడ్డి, ఇందుర్తి బల్ల రాములు పార్టీ బలోపేతం కోసం ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. ఆప్తులను కోల్పోయిన కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు నాయకులు, కార్యకర్తలు నిరంతరం అందుబాటులో ఉండాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు మామిడి అంజయ్య, జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ ఒంటెల కిషన్ రెడ్డి, మండల నాయకులు బేతి రాజిరెడ్డి, రామోజు కృష్ణమాచారి, అందె సుజాత, మారెళ్ల చంద్రయ్య, ఆకుల మొగిలి, అందే రాజమల్లు, సిద్దంకి రాజమల్లు, బిళ్ల వెంకట్‌రెడ్డి, బెజ్జంకి రాంబాబు, కాశబోయిన విజయలక్ష్మి, రాజు, మహంకాళి కొమురయ్య, అందే పోచయ్య, గ్రామ శాఖ మాజీ అధ్యక్షులు గిట్ల తిరుపతి రెడ్డి, ఎస్‌కే సిరాజ్, శ్యామకూర సంపత్ రెడ్డి, పరిపాటి రవీందర్ రెడ్డి, ముసుకుల కృష్ణారెడ్డి, సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మీ కళ్లతో.. మరో ఇద్దరి జీవితాల్లో వెలుగు

### -మరణించిన ఆరు గంటల్లోపు నేత్రాలు సేకరించాలి

### -డీఎంహెచ్‌వో డాక్టర్ అంజేలా ఆల్ఫ్రెడ్

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల :



మనిషి మరణించిన తర్వాత కూడా అతని కళ్లతో మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపవచ్చని,నేత్రదానం ద్వారా కార్నియా సంబంధిత అంధత్వంతో బాధపడుతున్న వారికి చూపును ప్రసాదించే అవకాశం ఉంటుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అంజేలా ఆల్ఫ్రెడ్ అన్నారు.

తెలిపారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా జిల్లాలోని రంగినేని ట్రస్ట్ ఓల్డ్ ఏజ్ హోమ్ రగుడు, లగిశెట్టి శ్రీనివాస్ ఓల్డ్ ఏజ్ హోమ్ తంగళ్లపల్లి, ప్రభుత్వ ఓల్డ్ ఏజ్ హోమ్ మండేపల్లిలో నేత్రదానంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ అంజేలా ఆల్ఫ్రెడ్ మాట్లాడుతూ

కంటి చూపు అత్యంత విలువైనదని, చూపు కోల్పోయిన వారికి నేత్రదానం ద్వారా తిరిగి వెలుగును అందించే అవకాశం ఉందని,నేత్రదానంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి, మరింత మందిని దానానికి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.మరణించిన వ్యక్తి నేత్రాలను సాధ్యమైనంత త్వరగా, సాధారణంగా ఆరు గంటల్లోపు సేకరించాల్సి ఉంటుందని తెలిపారు. కళ్లద్దాలు ధరించే వారు, మధుమేహం లేదా అధిక రక్తపోటు ఉన్నవారు, కంటిశుక్లం శస్త్రచికిత్స చేయించుకున్నవారు కూడా అర్హతను వైద్యులు నిర్ధారించిన మేరకు నేత్రదానం చేయవచ్చని అన్నారు .ఇంట్లో ఎవరైనా మరణించినప్పుడు వెంటనే సంబంధిత నేత్ర సేకరణ కేంద్రానికి సమాచారం ఇవ్వాలని,మృతుని కళ్లను మూసి ఉంచి, ఫ్యాన్‌ను ఆపి, కనురెప్పలపై తడి గుడ్డ లేదా మంచు ఉంచడం ద్వారా నేత్రాల తేమను కాపాడాలని తెలిపారు. నిపుణులు మృతుని వద్దకే వచ్చి కొద్ది సమయంలోనే నేత్ర సేకరణ ప్రక్రియను పూర్తి చేస్తారని చెప్పారు. ఈ ప్రక్రియ వల్ల మృతదేహం ముఖంలో ఎలాంటి వికృతి కలగదని అన్నారు .నేత్రదాత, నేత్రగ్రహీత వివరాలను గోప్యంగా ఉంచుతామని, నేత్ర సేకరణ నుంచి కార్నియా మార్పిడి వరకు ప్రక్రియను ఉచితంగా నిర్వహిస్తామని తెలిపారు. ''నేత్రదానం చేయండి.. మరో ఇద్దరికి చూపుని ప్రసాదించండి'' అనే సందేశంతో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా అంధత్వ నివారణ కార్యక్రమ అధికారి డాక్టర్ నయీమ్ జహా, రాజేందర్, నిఖిల్, ఆప్టోమెట్రిస్టు నాగరాజు, ఓల్డ్ ఏజ్ హోమ్ కోఆర్డినేటర్ మమత తదితరులు పాల్గొన్నారు.

## 1000 రోజుల కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ నిరసనలకు సన్నాహాలు..

### చొప్పదండి నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆధ్వర్యంలో కీలక సమావేశం..



బలగం టీవీ, చొప్పదండి:

కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన 1000 రోజుల పాలనను నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ప్రకటించిన వారం రోజుల నిరసన కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు చొప్పదండి నియోజకవర్గంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన ముఖ్య నాయకులు, పార్టీ కార్యకర్తలు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు హాజరయ్యారు.

ఈ సందర్భంగా వారం రోజుల పాటు నిర్వహించనున్న నిరసన కార్యక్రమాలపై నాయకులు విస్తృతంగా చర్చించారు. మండలాలు, గ్రామాల వారీగా కార్యక్రమాలను చేపట్టి, కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, అభివృద్ధి పనుల పరిస్థితి, స్థానికంగా నెలకొన్న ప్రజా సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించారు.

ప్రతి మండలంలో పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ నిరసన కార్యక్రమాలను నిర్వహించాలని నాయకులు సూచించారు. గ్రామస్థాయి నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

చొప్పదండి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, నిరసన కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

## రెడ్డి హక్కుల సాధనకు ఉద్యమబాట..




### -ఇందిరాపార్క్ వద్ద నిరాహార దీక్షకు పిలుపు..

### -రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి..

### పేద రెడ్డిలకు రైతు బీమా వర్తింపజేయాలి: రెడ్డి ఐక్యవేదిక

### నిరాహార దీక్షను విజయవంతం చేయండి..

### -జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

రెడ్డి సామాజిక వర్గం హక్కులు, సంక్షేమం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని చేపట్టనున్నట్లు రాష్ట్ర రెడ్డి ఐక్యవేదిక అధ్యక్షులు నాగర్తి చంద్రారెడ్డి తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం నూతన కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

రెడ్డి ఐక్యవేదిక ఆధ్వర్యంలో తేదీ 8- 9 -2026 శనివారం రోజున హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ఒక్క రోజు నిరాహార దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. రెడ్డిలకు అన్ని హక్కులు కల్పించడంతో పాటు ప్రభుత్వం వెంటనే రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

పేద రెడ్డి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని, పేద రెడ్డిలు ఆకస్మికంగా మరణించిన సందర్భాల్లో వారికి రైతు బీమా పథకం వెంటనే వర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పేద రెడ్డి విద్యార్థులను అన్ని విధాలుగా ఆదుకోవాలని, విద్యా అవకాశాల్లో వారికి తగిన సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు, నిరాహార దీక్షలు చేపట్టి రెడ్డి హక్కులను సాధించుకునే వరకు పోరాటం కొనసాగిస్తామని నాయకులు హెచ్చరించారు. ప్రభుత్వం తమ డిమాండ్లపై సానుకూలంగా స్పందించేలా ఒత్తిడి తీసుకొస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డి ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు ఏనుగు సంతోష్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంధి తిరుపతిరెడ్డి, రాష్ట్ర సహాధ్యక్షులు పూర్మాని రాంలింగారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ బండ గోపాల్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు నేరెళ్ల భూమిరెడ్డి, దొంగల బాపురెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఎగుమామిడి కృష్ణారెడ్డి, నరెడ్ల రాఘవరెడ్డి, గుల్లపల్లి నరసింహారెడ్డి, సంయుక్త కార్యదర్శి మంద బాల్రెడ్డి, కోశాధికారి ఎడ్మల హనుమంతరెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ అబ్బాడి తిరుపతిరెడ్డి, ప్రచార కార్యదర్శి గడ్డం సత్యనారాయణరెడ్డి, సీనియర్ నాయకులు ఉప్పల లక్ష్మారెడ్డి, ఎ.రెడ్డి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మానకొండూరులో అరాచక పాలన.. ప్రశ్నిస్తే కేసులా?



### మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తీవ్ర ధ్వజమెత్తారు

### రాష్ట్రంలోనే ఓడిపోయే మొదటి సీటు మానకొండూరే: ఎద్దేవా

### పోలీసుల తీరుపై, అధికార పార్టీ బెదిరింపులపై మండిపాటు

బలగం టీవీ, తిమ్మాపూర్

మానకొండూరు నియోజకవర్గంలో అరాచక పాలన సాగుతోందని, ప్రజాసమస్యలపై ఎవరు ప్రశ్నించినా వారిపై అక్రమ కేసులు పెడుతూ బెదిరింపులకు పాల్పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. హామీ ఇచ్చిన పనులను అడిగితే దాడులకు ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. తిమ్మాపూర్ మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ తీరుపై, స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ వైఖరిపై విమర్శల వర్షం కురిపించారు.

ఓడిపోయే తొలి సీటు ఇదే..

వివిధ సర్వేల్లో రాష్ట్రంలోనే మానకొండూరు నియోజకవర్గం ఓడిపోయే మొదటి స్థానంలో ఉందని తేలడంతో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఏం చేయాలో పాలుపోక తికమక పడుతున్నారని రసమయి ఎద్దేవా చేశారు. గత హయాంలో తాను తెచ్చిన నిధులతో చేపట్టిన రోడ్డు పనులను పూర్తి చేయడం కూడా చేతకాని అసమర్థుడిగా మిగిలిపోయారని విమర్శించారు. కేవలం రూ. ఐదు కోట్లు పెండింగ్ బిల్లు ఇప్పిస్తే పూర్తయ్యే ఆ పనులను కూడా పట్టించుకోవడం లేదన్నారు. నాడు తనపై యువజన సంఘాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందిన నేడు.. అదే యువజన సంఘాలు చేస్తున్న శాంతియుత ర్యాలీని పోలీసులను అడ్డంపెట్టుకుని అడ్డుకోవడం సిగ్గుచేటని అన్నారు.

పోలీసుల ఏకపక్ష వైఖరిపై ఆగ్రహం

శాంతియుత ర్యాలీకి పోటీగా అదే రోజు మరో ర్యాలీ నిర్వహించడం ఏమిటని ప్రశ్నించారు. నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఎవరి నిరసనలనూ అడ్డుకోలేదని గుర్తుచేశారు. కిందిస్థాయి క్యాడర్ మద్దతు కరువవడంతోనే ఎమ్మెల్యేకు ఏం చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు.

నేరంలో నిందితుడిగా ఉండి కండిషన్ బెయిల్‌పై ఉన్న మురళీధర్ రెడ్డి స్వేచ్ఛగా తిరుగుతున్నా పట్టించుకోని పోలీసులు, బీఆర్ఎస్ కార్యకర్తలు చిన్న మెసేజ్ పెట్టినా కేసులు పెడుతున్నారని ఆరోపించారు. నిందితులు రెచ్చగొట్టే పోస్టులు పెడుతున్నా పోలీసులు మౌనంగా ఉండటంపై సీపీని కలుస్తామని హెచ్చరించారు.

మహిళా కార్యకర్తల నిర్లక్ష్యం.. డాక్టర్ అనురాధ తీరుపై విమర్శలు

ఎమ్మెల్యే సతీమణి డాక్టర్ అనురాధ కార్యకర్తలను రెచ్చగొట్టేలా వ్యవహరించడం సరికాదని, పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీలోకి రాకముందు నుంచి ఉన్న పాత కార్యకర్తలను పట్టించుకోకుండా వారికి ఏం చేశారని నిలదీశారు. రాజేందర్ రెడ్డి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ.. మూడు రోజుల్లో వస్తానని చెప్పిన ఎమ్మెల్యే ఇప్పటివరకు బాధితుల వద్దకు వెళ్లకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. రాజకీయాలు చేసే డాక్టర్ అనురాధ ఒక మహిళ అయి ఉండి కూడా, తోటి మహిళ అయిన రాజేందర్ రెడ్డి భార్య కన్నీళ్లు తుడవకపోవడం దారుణమన్నారు.

బెదిరింపులకు భయపడేది లేదు

అక్రమ కేసులు, బెదిరింపులకు, తూటాలకు తాము భయపడేది లేదని, ఇలాంటి ఆటుపోట్లు ఎన్నో ఎదుర్కొని ముందుకు వచ్చామని స్పష్టం చేశారు. "మీ తూటాలు మాకు పెప్పర్మెంట్లతో సమానం" అని పేర్కొన్నారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకోకపోతే తాము కూడా అదే బాటలో స్పందిస్తామని హెచ్చరించారు.

# మూడోసారి ప్రపంచ విజేతగా అర్జెంటీనా

**డచ్‌లకు షాక్..**
**షూటౌట్‌లో 3-1 తేడాతో నెదర్లాండ్స్‌పై ఘన విజయం**
**నాలుగు వరుస టైటిళ్ల నెదర్లాండ్స్ కలలకు గండి**
**మూడో స్థానంతో సరిపెట్టుకున్న బెల్జియం**

బలగం టీవీ, న్యూఢిల్లీ

మహిళల ఎఫ్ఐహెచ్ (FIH) హాకీ ప్రపంచకప్‌లో అర్జెంటీనా సరికొత్త చరిత్ర సృష్టించింది. నాలుగు వరుస టైటిళ్లతో ఊపుమీదున్న సహ-ఆతిథ్య జట్టు నెదర్లాండ్స్‌కు షాకిస్తూ అర్జెంటీనా మూడోసారి ప్రపంచకప్ కిరీటాన్ని కైవసం చేసుకుంది. శనివారం హోరాహోరీగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో నిర్ణీత సమయం ముగిసేసరికి ఇరు జట్లు 1-1తో సమంగా నిలవడంతో విజేతను తేల్చేందుకు పెనాల్టీ షూటౌట్ నిర్వహించారు. Shoot-out లో అర్జెంటీనా 3-1 తేడాతో డచ్ జట్టును చిత్తు చేసి, గత ప్రపంచకప్‌తో పాటు టోక్యో ఒలింపిక్స్ ఫైనల్ ఓటములకు పగ తీర్చుకుంది.






ఫైనల్ మ్యాచ్ ముఖ్యాంశాలు:

తొలి గోల్ డచ్‌దే: ప్రపంచ నంబర్ వన్ డ్రాగ్-ఫ్లిక్కర్ ఇబ్బీ జాన్సన్ 30వ నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచి నెదర్లాండ్స్‌ను 1-0 ఆధిక్యంలో నిలిపింది.

కమ్‌బ్యాక్ ఇచ్చిన అర్జెంటీనా: మ్యాచ్‌లో లభించిన 8వ పెనాల్టీ కార్నర్ వద్ద అర్జెంటీనా కెప్టెన్ మారియా గ్రానాటో 54వ నిమిషంలో సమానత్వ గోల్ సాధించి మ్యాచ్‌ను షూటౌట్‌కు తీసుకెళ్లింది.

షూటౌట్ సమరం: పెనాల్టీ షూటౌట్‌లో అర్జెంటీనా తరఫున విక్టోరియా గ్రానాటో, బ్రిసా బ్రూగెస్సర్, సోఫియా కైరోలు గోల్స్ సాధించగా, నెదర్లాండ్స్ తరఫున మార్జిన్ వీన్ మాత్రమే గోల్ చేయగలిగింది.

చారిత్రక ఘనత:

గతంలో 2002, 2010 లలో నెదర్లాండ్స్‌ను ఓడించే అర్జెంటీనా టైటిళ్లను గెలుచుకుంది. ఈ మ్యాచ్ ద్వారా మరోసారి డచ్ పైచేయికి చెక్ పెట్టి మూడోసారి ట్రోఫీని ఎగురేసుకుపోయింది.

మూడో స్థానంలో బెల్జియం:

అంతకుముందు జరిగిన మూడో స్థానం (థర్డ్ ప్లేస్) పోరులో బెల్జియం 1-0 తేడాతో ఆస్ట్రేలియాను ఓడించి కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది.

# కెప్టెన్సీ తొలిగింపుతో షాక్‌కు గురయ్యా




**సూర్యకుమార్ యాదవ్**
**వరల్డ్ కప్ గెలిపించినా తొలగించడం తీవ్ర నిరాశ పరిచింది**
**40-50 రోజులు ఏమీ చేయకుండా ఇంట్లోనే ఉండిపోయా**
**శ్రేయస్ అయ్యర్ మంచి నాయకుడు: భారత మాజీ కెప్టెన్ వ్యాఖ్యలు**

బలగం టీవీ, న్యూఢిల్లీ

తన సారథ్యంలో టీమిండియాను స్వదేశంలో టీ20 ప్రపంచకప్ విజేతగా నిలిపినప్పటికీ, భారత టీ20 కెప్టెన్సీ నుంచి ఉన్నపలంగా తొలగించడం తనను తీవ్ర దిగ్భ్రాంతికి, నిరాశకు గురిచేసిందని మాజీ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ వెల్లడించాడు. ఆ నిర్ణయం తర్వాత ఐర్లాండ్, ఇంగ్లండ్‌లలో పర్యటించిన యుకే టూర్ కోసం ఎంపిక చేసిన జట్టులో కూడా సూర్యకు చోటు దక్కలేదు. ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్‌ను విజయవంతంగా నడిపించిన శ్రేయస్ అయ్యర్‌కు టీ20 సారథ్య బాధ్యతలు అప్పగించారు.

భార్య మాటలే నాలో ధైర్యాన్ని నింపాయి

కెప్టెన్సీ మార్పు, జట్టులో చోటు దక్కకపోవడంపై భారత మాజీ క్రికెటర్ ఆకాష్ చోప్రా యూట్యూబ్ ఛానెల్‌లో సూర్యకుమార్ మాట్లాడుతూ కీలక విషయాలను పంచుకున్నాడు. "ఏం జరుగుతుందో అర్థం కాక 40 నుండి 50 రోజుల పాటు ఇంట్లోనే ఖాళీగా కూర్చుండిపోయాను. మళ్లీ క్రికెట్ ఆడాలా వద్దా? అని నా మనసులో ఎన్నో సందేహాలు కలిగాయి. ఆ సమయంలో నా భార్య వచ్చి '20 ఏళ్ల క్రితం ఈ ఆటను ఎందుకు ప్రారంభించావో ఒకసారి గుర్తుచేసుకో.. క్రికెట్ పట్ల నీకున్న ఆ పిచ్చిని, అభిలాషను మళ్లీ బయటకు తీయి' అని ధైర్యం చెప్పింది" అని పేర్కొన్నాడు.

ముందుకు తీసుకెళ్లామనుకున్నా.. కానీ!

భారత్ తరఫున 113 మ్యాచ్‌లలో 162.94 స్ట్రైక్ రేట్‌తో 3,272 పరుగులు సాధించిన 35 ఏళ్ల సూర్య, 2024 వరల్డ్ కప్ తర్వాత ఫామ్ లేమితో ఇబ్బంది పడ్డాడు. అయినప్పటికీ ఈ నిర్ణయాన్ని ఊహించలేదని తెలిపాడు. "మరో రెండేళ్లపాటు జట్టును సమర్థవంతంగా నడిపించి ఒలింపిక్స్, ఆ తర్వాత వచ్చే వరల్డ్ కప్‌లకు సిద్ధం చేయాలని ప్రణాళికలు రచించాను. కానీ యాజమాన్యం ఆలోచన వేరేలా ఉంటే మనం ఏమీ చేయలేం. రెండేళ్లలో ఒక్క సిరీస్ కూడా ఓడిపోలేదు, వరల్డ్ కప్, ఆసియా కప్ గెలిచాం.. అంతా బాగా జరుగుతున్నప్పుడు ఈ మార్పు ఎందుకో అర్థం కాలేదు. అయితే ఈ నిర్ణయంపై నేను భావోద్వేగానికి లోనుకాకుండా చిరునవ్వుతో స్వీకరించాను" అని అన్నాడు.

శ్రేయస్ అయ్యర్‌కు పూర్తి మద్దతు

కొత్తగా కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రేయస్ అయ్యర్‌పై సూర్య ప్రశంసలు కురిపించాడు. "శ్రేయస్ మంచి ఆటగాడు, అంతకంటే మంచి వ్యక్తి మరియు సమర్థుడైన నాయకుడు. అతని ఎంపికను నేను ఎప్పుడూ తప్పుపట్టలేదు. అతడి సారథ్యంలో టీమిండియా మరిన్ని విజయాలు సాధించాలి" అని సూర్యకుమార్ స్పష్టం చేశాడు.

# లార్డ్స్ టెస్టుకు వరుణుడి అంతరాయం

**357 పరుగుల ఆధిక్యంలో ఇంగ్లండ్**
**డాన్ లారెన్స్ (50 నాటౌట్) బాధ్యతాయుత అర్ధ శతకం**
**తొలి ఇన్నింగ్స్‌లో 110 పరుగులకే కుప్పకూలిన పాకిస్తాన్**
**రాణించిన పాక్ బౌలర్లు, విఫలమైన ఇంగ్లండ్ టాపార్డర్**

బలగం టీవీ, న్యూఢిల్లీ

లార్డ్స్ వేదికగా పాకిస్థాన్‌తో జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించింది. ఆట మూడో రోజు ఇంగ్లండ్ తన రెండో ఇన్నింగ్స్‌లో ఆధిక్యాన్ని భారీగా పెంచుకోవాలని భావించినప్పటికీ వరుణుడు అడ్డుపడ్డాడు. వర్షం వల్ల ఆట నిలిచిపోయే సమయానికి ఇంగ్లండ్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 7 వికెట్ల నష్టానికి 117 పరుగులు చేయగా, మొత్తంమీద 357 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

తడబడిన ఇంగ్లండ్ టాపార్డర్:

రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్‌ను పాకిస్థాన్ బౌలర్లు తీవ్రంగా దెబ్బతీశారు. మొహమ్మద్ అబ్బాస్ (3/48), ఖుర్రం షెహజాద్ (2/56), మొహమ్మద్ అలీ (2/54)లు ధాటిగా బౌలింగ్ చేయడంతో ఆతిథ్య జట్టు టాపార్డర్ వరుసగా వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో హ్యారీ బ్రూక్ (34) కాసేపు పోరాడగా, డాన్ లారెన్స్ (50 నాటౌట్) అర్ధ శతకంతో ఇన్నింగ్స్‌ను ఆదుకున్నాడు. 46.5 ఓవర్ల వద్ద భారీ వర్షం పడటంతో అంపైర్లు ఆటను నిలిపివేశారు.

110 రన్స్ కే కుప్పకూలిన పాక్:



అంతకుముందు ఇంగ్లండ్ పేసర్లు ఓలీ రాబిన్సన్ (4/11), జోఫ్రా ఆర్చర్ (3/26)లు నిప్పులు చెరిగే బౌలింగ్‌తో విరుచుకుపడటంతో పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 110 పరుగులకే ఆలౌటైంది. పాక్ ఓపెనర్ అజాన్ అవైస్ (46) మినహా ఏ ఒక్కరూ రాణించలేకపోయారు. వర్షం తగ్గితే నాలుగో రోజు ఇంగ్లండ్ తమ ఆధిక్యాన్ని మరింత పెంచే అవకాశం ఉంది.

# క్రీడలు, అథ్లెట్ల ప్రోత్సాహానికి 5 మిషన్లు



**ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణు దేవ్ సాయ్**
**'ముఖ్యమంత్రి ఖేల్ ఉత్కర్ష్'కు రూ. 100 కోట్ల బడ్జెట్ కేటాయింపు**
**రాష్ట్ర క్రీడా పురస్కారాల ప్రధానోత్సవంలో 666 మందికి నజరానాలు**
**క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు**

బలగం టీవీ, రాయ్‌పూర్

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తమ ప్రభుత్వం ఐదు ప్రత్యేక మిషన్లపై పనిచేస్తోందని ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయ్ వెల్లడించారు. జాతీయ క్రీడా దినోత్సవం మరియు హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని శనివారం పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర క్రీడా పురస్కారాల ప్రదానోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రతిభను గుర్తించి, వారికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

రూ. 100 కోట్లతో సీఎం ఖేల్ ఉత్కర్ష్ మిషన్

క్రీడల అభివృద్ధి కోసం 'ముఖ్యమంత్రి ఖేల్ ఉత్కర్ష్ మిషన్'ను ప్రారంభించామని, దీని కోసం బడ్జెట్‌లో రూ. 100 కోట్లు కేటాయించినట్లు సీఎం తెలిపారు. కేవలం పోటీలు నిర్వహించడమే కాకుండా శిక్షణ, ఆధునిక పరికరాలు, క్రీడా మౌలిక వసతులు కల్పించేలా సమగ్ర వ్యవస్థను రూపుదిద్దుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 2023-24, 2024-25, 2025-26 సంవత్సరాలకు గానూ 126 మంది అథ్లెట్లు, కోచ్‌లకు రాష్ట్ర క్రీడా రత్న పురస్కారాలు అందించారు. మరో 540 మంది క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలు ఇచ్చారు. మొత్తం 666 మందికి రూ. 1.74 కోట్ల విలువైన పురస్కారాలు ప్రదానం చేశారు.

క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాలు

క్రీడాకారుల భవిష్యత్తుకు భరోసా కల్పించేందుకు 156 మంది ప్రతిభావంతులైన అథ్లెట్ల జాబితాను ఇటీవల విడుదల చేశామని, వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో నియామకాలు కల్పిస్తున్నామని సీఎం ప్రకటించారు. అలాగే గిరిజన ప్రాంతాల్లోని క్రీడాకారులను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న 'బస్తర్ ఒలింపిక్స్'కు విశేష ఆదరణ లభిస్తోందని, తొలి ఏడాది 1.65 లక్షల మంది పాల్గొనగా, రెండో ఏడాది ఆ సంఖ్య 3.91 లక్షలకు చేరిందని తెలిపారు.

రూ. 67 కోట్లతో ప్రపంచస్థాయి ఆర్చరీ అకాడమీ

రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పన వేగవంతంగా జరుగుతోందని సీఎం చెప్పారు:

నవా రాయ్‌పూర్: రూ. 67 కోట్ల వ్యయంతో ప్రపంచస్థాయి 'ఆర్చరీ అకాడమీ' నిర్మాణం.

పంద్రాపాట్ (జష్పూర్): 'పహాడీ కొర్వా' పీవీటీజీ గిరిజనుల కోసం రూ. 18 కోట్లతో ఆర్చరీ శిక్షణ కేంద్రం.

కొత్త స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు: కుంకురి (జష్పూర్), రాయ్‌గఢ్ మరియు రాయ్‌పూర్‌లలో అధునాతన స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ల ఏర్పాటు.

కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి, క్రీడా శాఖ మంత్రి అరుణ్ సావో మాట్లాడుతూ.. ఛత్తీస్‌గఢ్‌లో క్రీడా ప్రతిభకు కొదవలేదని, సీఎం నాయకత్వంలో యువతకు పూర్తి సహకారం అందిస్తున్నామని పేర్కొన్నారు.




## శ్రీలంక సిరీస్ ముగిసిన 48 గంటల్లోనే ఫిట్‌నెస్ పరీక్షకు హాజరైన టీమిండియా ఆటగాళ్లు

బలగం టీవీ, బెంగళూరు

శ్రీలంకతో రెండు టెస్టుల సిరీస్ ముగిసిన 48 గంటలలోపే భారత అగ్రశ్రేణి క్రికెటర్లు శనివారం బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో నిర్వహించిన ముందస్తు ఫిట్‌నెస్ పరీక్షలకు హాజరయ్యారు. 2027 ఐపీఎల్ వరకు సుదీర్ఘంగా సాగే 8 నెలల హోమ్ సీజన్ ప్రారంభానికి ముందు ఆటగాళ్లు ఈ రకమైన ఫిట్‌నెస్ పరీక్షలకు హాజరవడం విశేషం.

సీనియర్ ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా, వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్, ఓపెనర్ యశస్వి జైస్వాల్‌తో పాటు టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, షార్ట్ ఫార్మాట్ స్పెషలిస్టులు రింకూ సింగ్, సంజూ శామ్సన్, చెన్నై సూపర్‌కింగ్స్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ తదితరులు ఈ క్యాంప్‌లో తీవ్రంగా శ్రమించారు.

పరీక్షల వివరాలు:

బ్రాంకో టెస్ట్ (Bronco Test): 0m, 20m, 40m, 60m వద్ద కోన్స్ ఏర్పాటు చేసి విరామం లేకుండా 5 సెట్లలో 1200 మీటర్ల దూరాన్ని 5:30 నిమిషాల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది.

యో-యో టెస్ట్ (Yo-Yo Test): బెంచ్ మార్క్ పాయింట్ 16.5గా నిర్ణయించారు.

2k రన్: 2000 మీటర్ల పరుగును 10 నిమిషాల్లో పూర్తి చేయాలి.

ఇతర డ్రిల్స్: వికెట్ల మధ్య పరుగు తీసే ప్రాక్టీస్.

మినహాయింపులు:

శ్రీలంక సిరీస్‌లో ఎక్కువగా బౌలింగ్ చేసిన జస్ప్రీత్ బుమ్రా, హార్దిక్ పాండ్యా, నితీష్ కుమార్ రెడ్డిలు పూర్తి ఫిట్‌నెస్ సాధించిన అనంతరమే ఈ పరీక్షలకు హాజరవుతారు. అలాగే మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణలకు ప్రస్తుతానికి మినహాయింపు ఇచ్చారు. కాగా, యూకే పర్యటనలో గాయపడిన ప్రిన్స్ యాదవ్ కోలుకుని ఎంపికకు అందుబాటులోకి వచ్చాడు.

సెప్టెంబర్‌లో ప్రారంభమయ్యే భారత హోమ్ సీజన్, న్యూఢిల్లీలో ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగే 3 మ్యాచ్‌ల టీ20 సిరీస్‌తో ప్రారంభం కానుంది. తదనంతరం ప్రధాన టీ20 జట్టు ఆసియా క్రీడల (జపాన్) నిమిత్తం వెళ్లనుండగా, మిగిలిన వైట్ బాల్ స్పెషలిస్టులు వెస్టిండీస్‌తో హోమ్ సిరీస్ ఆడనున్నారు.




# భారత్‌కు బిగ్ షాక్

**ఆసియా గేమ్స్‌కు నీరజ్ చోప్రా దూరం**
**శిక్షణలో చీలమండ లిగమెంట్‌కు గాయం**
**సీజన్‌లో మిగిలిన అన్ని టోర్నీల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటన**
**యశ్వీర్ సింగ్‌పైనే భారత్ పతక ఆశలు**

బలగం టీవీ, న్యూఢిల్లీ

జపాన్‌లో సెప్టెంబర్ 19 నుంచి ప్రారంభం కానున్న ఆసియా గేమ్స్ 2026కు ముందే భారత అథ్లెటిక్స్ బృందానికి భారీ విఘాతం కలిగింది. భారత్‌కు పతకం ఖాయమని భావించిన స్టార్ జావెలిన్ త్రోయర్, 'గోల్డెన్ బాయ్' నీరజ్ చోప్రా గాయం కారణంగా ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీకి దూరమయ్యాడు. ప్రాక్టీస్ చేస్తున్న సమయంలో అతని చీలమండ (Ankle) లిగమెంట్ తీవ్రంగా చిట్లడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు నీరజ్ శనివారం సోషల్ మీడియా వేదికగా స్పష్టం చేశాడు.

మిగిలిన సీజన్ మొత్తానికి దూరం

ఇటీవల లుసాన్ డైమండ్ లీగ్‌లో 88.05 మీటర్ల త్రోతో ఈ సీజన్‌లోనే అత్యుత్తమ ప్రదర్శన చేసిన నీరజ్, ఈ గాయంపై తీవ్ర నిరాశ వ్యక్తం చేశాడు. వైద్యులు మరియు తన కోచింగ్ టీమ్‌తో చర్చించిన తర్వాత ఈ సీజన్‌లో మిగిలిన అన్ని పోటీల నుంచి తప్పుకుంటున్నట్లు వెల్లడించాడు. దీనివల్ల ఆసియా గేమ్స్‌తో పాటు సెప్టెంబర్ 5న జరిగే బ్రసెల్స్ డైమండ్ లీగ్ ఫైనల్, సెప్టెంబర్ 11-13 వరకు జరిగే వరల్డ్ అథ్లెటిక్స్ అల్టిమేట్ ఛాంపియన్‌షిప్‌లకు కూడా అతడు దూరం కానున్నాడు. ప్రస్తుతం తన దృష్టి అంతా పూర్తి ఫిట్‌నెస్ సాధించడంపైనే ఉందని తెలిపాడు.

భారత్‌కు తప్పని నిరాశ.. యశ్వీర్‌పైనే ఆశలు

ఇటీవల గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్‌లో నీరజ్ చోప్రా (85.83 మీటర్లు) రజత పతకం సాధించగా, భారత్‌కే చెందిన యశ్వీర్ సింగ్ (85.41 మీటర్లు) కాంస్య పతకం గెలుచుకున్నారు. నీరజ్ దూరం కావడం వల్ల ఆసియా గేమ్స్‌లో భారత్ ఒక నిశ్చిత పతకాన్ని కోల్పోయినట్లయింది. ఈ నేపథ్యంలో ఇప్పుడు జావెలిన్ త్రో విభాగంలో పతక ఆశలన్నీ యశ్వీర్ సింగ్‌పైనే నెలకొన్నాయి.



## నేను వికెట్లు తీసే బౌలర్‌నని ఇషాన్‌కు తెలియదు

**వైభవ్ సూర్యవంశీ**
**దులీప్ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్లో రాణించిన బీహార్ సంచలనం**
**ఈస్ట్ జోన్ ఇన్నింగ్స్ 210 పరుగుల భారీ విజయం**
**సెమీస్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ సెంట్రల్ జోన్‌తో తలాపడీ**

బలగం టీవీ, బెంగళూరు

దులీప్ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ఈస్ట్ జోన్ బ్యాటింగ్‌లో రాణించలేకపోయినా, లెఫ్ట్ ఆర్మ్ స్పిన్‌తో రెండు కీలక వికెట్లు తీసి జట్టు విజయంలో భాగస్వామినైనందుకు ఎంతో సంతోషంగా ఉందని యువ బ్యాటింగ్ సంచలనం వైభవ్ సూర్యవంశీ తెలిపాడు. నార్త్ ఈస్ట్ జోన్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో ఈస్ట్ జోన్ ఇన్నింగ్స్ మరియు 210 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది.

ఇషాన్ రిస్క్ అనుకున్నాడు.. కానీ!

ఈస్ట్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 467 పరుగుల భారీ స్కోరు సాధించినప్పటికీ, సూర్యవంశీ కేవలం 8 పరుగులకే నిరాశపరిచాడు. అయితే నార్త్ ఈస్ట్ జోన్ రెండో ఇన్నింగ్స్‌లో వికెట్లు పడని సమయంలో ఈస్ట్ జోన్ కెప్టెన్ ఇషాన్ కిషన్ ఊహించని విధంగా సూర్యవంశీ చేతికి బంతిని అందించాడు. బీసీసీఐ పంచుకున్న వీడియోలో సూర్యవంశీ మాట్లాడుతూ.. "ఎదురు జట్టు వికెట్ పడని సమయంలో నన్ను 2-3 ఓవర్లు బౌలింగ్ చేయమని అడిగారు. ఇషాన్ భయ్యా నాతో బౌలింగ్ చేయించడాన్ని కొంత రిస్క్‌గా భావించి ఉంటాడు. కానీ నేను వికెట్లు తీసే బౌలర్‌నని ఆయనకు తెలియదు" అని సరదాగా వ్యాఖ్యానించాడు.

అద్భుత ప్రదర్శన..

నార్త్ ఈస్ట్ జోన్ రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 3 ఓవర్లలో 11 పరుగులు ఇచ్చి 2 వికెట్లు (కిషన్ లింగ్డో 25, ఇమ్లివాతి లెమ్తుర్ 4) తీసి ప్రత్యర్థిని దెబ్బతీశాడు. "బ్యాటింగ్‌లో పరుగులు చేయలేకపోయినా, బౌలింగ్‌లో జట్టు విజయానికి ఉపయోగపడటం గొప్ప సంతృప్తిని ఇచ్చింది. సాధారణంగా ఏ బ్యాటర్ అయినా వికెట్ తీస్తే వచ్చే ఆనందమే వేరు" అని పేర్కొన్నాడు.

సెమీస్‌లో సెంట్రల్ జోన్‌తో పోరు

ఈ ఘన విజయంతో సెమీఫైనల్‌కు దూసుకెళ్లిన ఈస్ట్ జోన్, ఆదివారం నుంచి బెంగళూరు వేదికగా ప్రారంభమయ్యే తొలి సెమీఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ సెంట్రల్ జోన్‌తో తలపడనుంది.

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

# CINEMA




# టాక్సిక్‌పై మిక్స్‌డ్ టాక్

### భారీ నష్టాలు తప్పవంటూ సోషల్ మీడియా కూత

కేజీఎఫ్ స్టార్ యశ్ హీరోగా, దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తెరకెక్కించిన భారీ పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్' కు రిలీజ్‌కు ముందు భారీ అంచనాలు నెలకొ నడంతో అడ్వాన్స్ బుకింగ్స్‌లో అదిరిపో యే స్పందన లభించింది. అయితే సినిమా విడుదలైన తర్వాత మాత్రం ప్రేక్షకులు, విమర్శకుల నుంచి మిశ్రమ స్పందన వస్తోంది. ప్రీమియర్ షోల నుంచే సిని మాపై డివైడ్ టాక్ మొదలైంది. అడ్వాన్స్ బుకింగ్స్ కారణంగా తొలి రోజు భారీ ఓపెనింగ్స్ నమోదైనప్పటికీ, దీర్ఘకాలంలో సినిమా బాక్సాఫీస్ వద్ద ఏ మేరకు నిలబడుతుందన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఇదే సమయంలో 'టాక్సిక్' తెలుగు థియేట్రికల్ హక్కులను దక్కిం చుకున్న ప్రముఖ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ దిల్ రాజుకు భారీ నష్టాలు తప్పవంటూ సోషల్ మీడియాలో ప్రచారం మొద లైంది. 'టాక్సిక్' సినిమాపై ప్రారంభం నుంచే భారీ బజ్ నెలకొంది. యశ్‌కు 'కేజీఎఫ్' సిరీస్ తర్వాత దేశవ్యాప్తంగా వచ్చిన క్రేజ్, సినిమా భారీ స్థాయిలో రూపొందడం, పాన్ ఇండియా రిలీజ్ వంటి అంశాలు బిజినెస్‌పై ప్రభావం చూపాయి. ఈ సినిమాపై ఉన్న నమ్మకంతో దిల్ రాజు తెలుగు హక్కులను దక్కించుకున్నారని ప్రచారం జరిగింది. ప్రీరిలీజ్ ఈవెంట్‌లోనూ సినిమాపై చిత్రబృందం చూపించిన విశ్వాసం భారీగా కనిపించింది. మ్యూజిక్ డైరెక్టర్ విశాల్ మిశ్రా ఈ సినిమా రూ. 2,000 కోట్ల వసూళ్ల సామర్థ్యం ఉన్న ప్రాజెక్ట్ అని చెప్పినట్లు దిల్ రాజు ప్రస్తావించడం అప్పట్లో వైరల్ అయింది. ఆ నమ్మకంతోనే తెలుగు రాష్ట్రాల్లో 'టాక్సిక్'ను భారీ ఎత్తున థియేటర్లలో విడుదల చేశారు. కానీ విడుదలైన మొదటి రోజే టాక్ అంచనా లకు భిన్నంగా రావడంతో ఇప్పుడు బాక్సాఫీస్ రన్‌పై చర్చ సాగుతోంది. 'టాక్సిక్'కు డివైడ్ టాక్ రావడంతో కొందరు నెటిజన్లు దిల్ రాజు భారీగా నష్టపోతారంటూ పోస్టులు పెడుతున్నారు. రూ. 100 కోట్ల వరకు నష్టం వస్తుందని కూడా సోషల్ మీడియాలో లెక్కలు వైరల్ అవుతున్నాయి.




# మరోమారు సుక్కుతో రామ్‌చరణ్ జోడీ



### రంగస్థలంను మించి ఉంటుందంటూ ప్రచారం

టాలీవుడ్ నుంచి రాబోతున్న అత్యంత క్రేజీ ప్రాజెక్టుల్లో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, స్టార్ దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న సినిమా కూడా ఒకటి. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'రంగస్థలం' టాలీవుడ్‌లో ఎంతటి సంచలన విజయాన్ని నమోదు చేసిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇప్పుడు ఈ హిట్ కాంబినేషన్ మరోసారి జతకట్టబోతుండటంతో అభిమానుల్లో అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. రామ్ చరణ్ ఇటీవల 'పెద్ది'తో భారీ విజయాన్ని అందుకోగా, మరోవైపు సుకుమార్ 'పుష్ప 2'తో పాన్ ఇండియా స్థాయిలో సంచలనాత్మక విజయాన్ని నమోదు చేశారు. తమ తమ కెరీర్‌లో భారీ విజయాల తర్వాత ఈ ఇద్దరూ మరోసారి కలిసి పనిచేయబోతుండటం ఈ ప్రాజెక్ట్‌పై మరింత హైప్‌ను పెంచుతోంది. అంతేకాదు, 'రంగస్థలం' వంటి ఐకానిక్ సినిమాను అందించిన కాంబినేషన్ కావడంతో ఈసారి ఎలాంటి కథతో ప్రేక్షకుల ముందుకు వస్తారనే ఆసక్తి అందరిలోనూ నెలకొంది. సుకుమార్ మార్క్ కథనం, రామ్ చరణ్ ఇంటెన్స్ పెర్ఫార్మెన్స్ మరోసారి కలిస్తే బాక్సాఫీస్ వద్ద మరో భారీ సంచలనం నమోదవుతుందని అభిమానులు ఇప్పటికే అంచనా వేస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌పై నిర్మాత రవి శంకర్ చేసిన తాజా వ్యాఖ్యలు ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఈ కాంబినేషన్‌పై అభిమానులు ఎంతటి అంచనాలు పెట్టుకున్నా, వాటిని మించే స్థాయిలో సినిమా ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేసినట్లు సమాచారం. సినిమా టైటిల్, కథాంశం, ఇతర నటీనటులు, టెక్నికల్ టీమ్‌కు సంబంధించిన వివరాలు ఎప్పుడు బయటకు వస్తాయన్నది ఆసక్తికరంగా మారింది. అధికారిక ప్రకటన వచ్చిన తర్వాత ఈ ప్రాజెక్ట్‌పై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. తాజా టాక్ ప్రకారం, ఈ భారీ ప్రాజెక్ట్ షూటింగ్ ఈ ఏడాది నవంబర్ నుంచి ప్రారంభమయ్యే అవకాశం ఉందని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రస్తుతం రామ్ చరణ్, సుకుమార్ ఇద్దరూ తమ తమ ప్రాజెక్టులతో బిజీగా ఉన్న నేపథ్యంలో, ఈ సినిమా షూటింగ్ షెడ్యూల్ ఎలా ఉండబోతుందనేది కూడా ఆసక్తికరంగా మారింది.




# సినిమా విజయం చిత్ర పరిశ్రమలో అందరిది


### ఇరుడముడికి చిరంజీవి ప్రత్యేక అభినందనలు



ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి ఘన విజయాన్ని సొంతం చేసుకుంది 'ఇరుముడి'. రవితేజ ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమాపై ఇప్పటికే పలువురు ప్రముఖులు ప్రశంసలు కురిపించగా.. తాజాగా అగ్ర కథానాయకుడు చిరంజీవి ఈ హిట్ సినిమాపై రివ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన పెట్టిన క్యాప్షన్ ప్రస్తుతం అందరినీ ఆకట్టుకుంటోంది. ఒక సినిమా విజయం సాధిస్తే పరిశ్రమలో అందరికీ పండగే అని చెప్పిన చిరు.. 'ఈ పరిశ్రమ అందరిది.. ఏ కొందరిదో కాదు. మనం బతకాలి.. ఇతరులనూ బతికించాలి' అని పేర్కొన్నారు. ఇక 'ఇరుముడి' చిత్రబృందానికి చిరంజీవి శుభాకాంక్షలు తెలిపారు. నాకెంతో ఇష్టమైన సోదరుడు రవితేజకు అభినందనలు. సినిమాను మొదటి నుంచి చివరి వరకు పూర్తిగా ఆస్వాదించా. రవితేజ అద్భుతంగా నటించాడు. ఈ సినిమా బాధ్యతను దర్శకుడు శివ నిర్వాణ తన భుజాలపై వేసుకుని గొప్పగా తీర్చిదిద్దారు. సున్నితమైన భావోద్వేగాన్ని ఆవిష్కరించిన తీరు బాగుంది. బాలనటి నక్షత్రకు గొప్ప భవిష్యత్ ఉండాలని కోరుకుంటున్నా. 'ఇరుముడి'లో భాగమైన నటీనటులకు, టెక్నీషియన్స్‌కు, నిర్మాతలకు ప్రత్యేక అభినందనలు' అని చిరు తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఈ చిత్ర విజయం అర్థమైనదని పేర్కొన్నారు. చిరు పోస్ట్‌పై రవితేజ స్పందించారు. 'అన్నయ్యా థాంక్యూ..' అంటూ హార్ట్ ఎమోజీలను జోడించి కృతజ్ఞతలు చెప్పారు. విడుదలైన నాటి నుంచి థియేటర్స్ హౌస్ ఫుల్‌తో కళకళలాడుతుండగా, ఆరో రోజు కూడా అదే జోరు కొనసాగింది. కొన్ని థియేటర్‌లలో ప్రస్తుతం ఉన్న సినిమాను తీసేసి 'ఇరుముడి' వేయాలంటూ పలువురు ప్రేక్షకులు ఆందోళన చేస్తున్నారు. మరికొన్ని చోట్ల సీట్లు సరిపోక కుర్చీలు తెచ్చుకుంటున్నారు. కొన్ని హాళ్లలో ఏకంగా భజనలు చేస్తున్నారు. ఈ దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# అల్లు అర్జున్‌కు అరుదైన గౌరవం

### ఫోర్బ్స్ మ్యాగజైన్ కవర్‌పై మెరిసిన హీరో




అగ్రకథానాయకుడు అల్లు అర్జున్ మరో ఘనత సాధించారు. ప్రముఖ అంతర్జాతీయ మ్యాగజైన్ ఫోర్బ్స్ ఇండియా 'షోస్టాపర్స్ 2026' ప్రత్యేక సంచిక కవర్ పేజీపై ఆయన మెరిశారు. ఈ సందర్భంగా పరిశ్రమలో ప్రస్తుత పరిస్థితులు, సినిమాలో కథ ప్రాముఖ్యతను ఆయన వివరించారు. బాలీవుడ్, దక్షిణాది సినిమా లేదా మరే ఇతర ప్రాంతీయ సినిమా అయినా సరే.. బాక్సాఫీస్ వద్ద ఆదరణ పొందాలంటే కథే ప్రధానం. మంచి కంటెంట్ ఉంటే భాషతో సంబంధం లేకుండా హిట్ అవుతుంది. కొత్త కథను ప్రేక్షకులకు అందించడమే అన్నిటికంటే ముఖ్యం' అని అల్లు అర్జున్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. సినిమాల్లోని నటీనటుల స్టార్‌డమ్ కంటే కూడా సరైన కథే చిత్ర విజయాన్ని నిర్ణయిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. 2025 జనవరి నుంచి 2026 మార్చి వరకు సినిమాలు, ఓటీటీ, క్రీడలు, సంగీతం, టెలివిజన్.. ఇలా వివిధ రంగాల్లో ప్రభావం చూపిన 100 మంది తారల జాబితాను 'షోస్టాపర్స్' పేరుతో ఫోర్బ్స్ ఇండియా తాజాగా విడుదల చేసింది. ఈ లిస్ట్‌లో ఇండస్ట్రీకి చెందిన పలువురు నటీనటులు చోటు దక్కించుకున్నారు. అల్లు అర్జున్‌తో పాటు అమితాబ్ బచ్చన్, మోహన్ లాల్, రజనీకాంత్, రామ్ చరణ్, షారుక్ ఖాన్, ఆమిర్ ఖాన్, అక్షయ్ కుమార్, ఏఆర్ రెహమాన్, బాబీ డియోల్, దుల్కర్ సల్మాన్, మాధవన్, రణ్‌వీర్ సింగ్, రిషబ్ శెట్టి, కళ్యాణి ప్రియదర్శన్, కంగనా రనౌత్ ఇందులో ఉన్నారు.

# రణబాలి రిలీజ్ అక్టోబర్16కు మార్పు

రౌడీ హీరో విజయ్ దేవరకొండ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా మూవీ 'రణబాలి' పై కీలక అప్డేట్ వచ్చింది. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన సాంగ్, గ్లింప్స్ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని క్రియేట్ చేశాయి. భారీ యాక్షన్, పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వం వహిస్తున్నారు. ముందుగా ఈ సినిమాను సెప్టెంబర్ 11 ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేశారు. అయితే కొన్ని కారణాలతో విడుదలను వాయిదా వేశారు. తాజాగా 'రణబాలి' కొత్త రిలీజ్ డేట్‌ను చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. అక్టోబర్ 16న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ పవర్‌ఫుల్ లుక్‌తో కూడిన కొత్త పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. పోస్టర్‌లో కనిపిస్తున్న ఇంటెన్స్ లుక్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. కొత్త రిలీజ్ డేట్ ప్రకారం దసరా సీజన్‌కు దగ్గరగా 'రణబాలి' ప్రేక్షకుల ముందుకు రానుంది. పండుగ సెలవులు, భారీ స్టార్ ఇమేజ్ ఉన్న హీరో సినిమా కావడంతో బాక్సాఫీస్ వద్ద మంచి ఓపెనింగ్స్‌పై మేకర్స్ భారీ ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఇదే తేదీకి సూపర్‌స్టార్ రజినీకాంత్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'జైలర్ 2' కూడా ప్రేక్షకుల ముందుకు రానుండటంతో ఆసక్తికరమైన బాక్సాఫీస్ క్లాష్‌కు తెరలేచింది. ఒకవైపు విజయ్ దేవరకొండకు తెలుగు రాష్ట్రాలతో పాటు నార్త్ ఇండియా, ఇతర భాషల్లోనూ మంచి మార్కెట్ ఉంది. మరోవైపు రజినీకాంత్‌కు దేశవ్యాప్తంగా భారీ ఫ్యాన్ బేస్ ఉండటంతో ఈ రెండు సినిమాల పోటీపై ఇప్పటి నుంచే చర్చ మొదలైంది. 'రణబాలి'ని సాధారణ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా కాకుండా భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. 19వ శతాబ్దం నేపథ్యంలో కథ సాగుతుంది. ముఖ్యంగా బ్రిటిష్ పాలన కొనసాగుతున్న సమయంలో 1854 నుంచి 1878 మధ్య జరిగిన చారిత్రక పరిణామాలను ఆధారంగా చేసుకుని ఈ కథను రూపొందిస్తున్నట్లు మేకర్స్ ఇప్పటికే వెల్లడించారు. విజయ్ దేవరకొండ ఈ సినిమాలో ఇంతకుముందెన్నడూ చూడని విధమైన పాత్రలో కనిపించనున్నారని టాక్. పీరియాడిక్ ప్రపంచం, భారీ యాక్షన్ సన్నివేశాలు, అప్పటి కాలానికి సంబంధించిన సెట్స్, విజువల్స్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని తెలుస్తోంది.

